# పిల్లలమర్రి రమణీయతకు..
# మంత్రముగ్ధులు



మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట





రాజరాజేశ్వరీ ఆలయం వద్ద నమస్కరిస్తున్న ప్రపంచసుందరీమణులు

**మహబూబ్‌నగర్ బ్యూరో, మే 16 ప్రభాతవార్త:** ప్రపంచం లోనే ప్రత్యేక స్థానం పొంది భారతదేశంలో అతిపెద్ద వృక్షాల్లో ఒకటిగా నిలిచిన పిల్లల మర్రి అందాల భామలను ఆకట్టుకున్నది. శుక్రవారం హైదరాబాద్ నుంచి వచ్చిన 22 దేశాల సుందరిమణులు (మిస్ వరల్డ్ కంటెస్టెంట్ ) శుక్రవారం సాయంత్రం ఐదు గంటలకు పిల్లలమర్రి చేరుకున్నారు. పిల్లలమర్రి ప్రవేశద్వారం వద్దే స్థానికులు సంప్రదాయ వస్త్రాలతో కంటెస్టెంట్లకు స్వాగతం పలికారు. రోడ్డు మార్గాన పిల్లలమర్రికి చేరుకున్న అందాల భామలకు ఆత్మీయ స్వాగతం పలికారు. 5.05 గంటల నుంచి 5.10 గంటల వరకు శ్రీ రాజరాజేశ్వరి ఆలయం వద్ద అమ్మవారికి భారతీయ శాస్త్రీయ పద్ధతిలో నమస్కరించారు. అనంతరం ఆర్కియాలజిస్ట్ ఈమని శివనాగిరెడ్డి ఆలయ ప్రాశస్తం విగ్రహాలు మ్యూజియంలో ఏర్పాటు చేసిన వివిధ శాసనాలు గురించి వాటి చరిత్ర గురించి సుందరి మణులకు వివరించారు. అనంతరం ఆలయం ఆవరణలో అందరూ గ్రూప్ ఫోటో దిగారు. అనంతరం మ్యూజియంలో ప్రతి విగ్రహాన్ని గణేష్ విగ్రహాన్ని అక్కడి శాసనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. 5.57కు బతుకమ్మ పాటకు ఆడి స్టెప్పులు వేసి అందరినీ ఆశ్చర్యపరిచారు. అక్కడే డిఎఫ్ఓ సత్యనారాయణ పిల్లలమర్రి చరిత్ర గురించి ప్రపంచ సుందరి మణులకు వివరించారు. 70 ఏళ్ల నాటి చరిత్ర కలిగిన పిల్లలమర్రి గురించి అక్కడి ప్రకృతి రమణీయత గురించి, శాస్త్రీయతపై పిల్లలమర్రి ప్రాశస్త్యంపై వివరించారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన బంజారా నృత్యాలను వీక్షించారు. అనంతరం తెలంగాణ బోనాల సంస్కృతికి అద్దం పట్టేలా చేసిన నృత్యాలను చూసి తన్మయత్వం పొందారు. అక్కడే మొక్కలు నాటి నీళ్ళు పోశారు. అనంతరం పాఠశాల విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమం ఏర్పాటు చేసి విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు ప్రపంచ సుందరిమణులు ఓపికగా సమాధానాలు చెప్పారు. అంతేకాక అక్కడే భారతీయ సంస్కృతికి అద్దం పట్టేలా ఏర్పాటు చేసిన శాస్త్రీయ నృత్యానికి సుందరీమణులు మంత్రముగ్ధుల య్యారు. వాయిద్యం, సంస్కృతి, సాంప్రదాయ నాదస్వర, కోలాటాల స్వాగతంతో మైమరచిపోయారు. ప్రతి క్షణాన్ని అందగత్తెలు ఆస్వాదించేలా చక్కని ఏర్పాట్లు చేశారు. పిల్లలమర్రి ప్రాశస్త్యాన్ని పాలమూరు ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటే ఉద్దేశంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని జిల్లా యంత్రాగం స్థానిక ప్రజా ప్రతినిధుల సహకారం, సమన్వయంతో జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి, ఎస్పీ జానకి ధరావత్ నేతృత్వంలో అందాల భామల కోసం చక్కని ఏర్పాట్లు చేశారు. పిల్లలమర్రిని ప్రపంచానికి పరిచయం చేసేలా ప్రపంచ పర్యాటకంలో ప్రత్యేక గుర్తింపు దక్కేలా ప్రమోట్ చేశారు. కార్యక్రమ ప్రారంభం నుంచి చివరి వరకు అడుగడుగునా ఫోటోలకు ఫోజులిస్తూ ప్రకృతి రమణీయతను –మిగతా4లో..



బతుకమ్మ ఆడుతున్న సుందరీమణులు



నృత్యం చేస్తున్న కళాకారులు

## తెలంగాణ సంస్కృతి ప్రపంచానికి చాటాలి

### పిల్లలమర్రి ఆధ్యాత్మిక ప్రకృతి కేంద్రం.. పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు



తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచ సుందరీమణుల ద్వారా ప్రపంచానికి చాటి చెప్పాలని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక, ఆబ్కారీ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పిలుపునిచ్చారు. ప్రపంచ సుందరి పోటీల్లో పాల్గొనేందుకు వివిధ దేశాల నుండి విచ్చేసిన పోటీదారులకు స్వాగతం పలికారు. శతాబ్దాలుగా, లెక్కలేనన్ని మంది సాధువులు, ఆధ్యాత్మిక నాయకులు ఈ వృక్షశాస్త్ర అద్భుతాన్ని సందర్శించారు. మీరందరూ మీమీ దేశాలను గెలుపొం దాలనే ఆశలు, కలలను నిజం చేస్తూ, మీ సంబంధిత దేశాలను గర్వపడేలా చేసే ఆదర్శనీయమైన లక్ష్యంతో తెలంగా ణలో ఉన్నారు. మీ రాక మమ్మల్ని చాలా సంతోషపరిచింది. ఈ పట్టణ ప్రాంతానికి ప్రపంచవ్యాప్త ప్రాముఖ్యతను తెచ్చిపెట్టింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున విచ్చేసిన సుందరీమణులు అందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలి పారు. తెలంగాణ ఆహ్లాదకరమైన వాతావరణం, ప్రేమగల ప్రజలు ఉన్న భూమి అని, తెలంగాణ సాంస్కృతిక విలువలు, జ్ఞానోదయం, వినోదం కలిసి సాగుతాయన్నారు. ఈ ప్రకృతి ఒడిలో తిరిగినప్పుడు, మీ చుట్టూ ఉన్న విషయాల గురించి మీరు కొత్త ఆలోచనలను కనుగొన్నారని అనుకుంటున్నట్లు తెలిపారు. ఇది ఖచ్చితంగా ఆత్మను నింపే అనుభవం, మీ ఆలోచనాత్మక మనస్సులకు స్పందించే యువ హృదయాలకు ఒక విందు అని చెప్పారు. పిల్లల మర్రిని తెలంగాణ ప్రభుత్వం ఒక ఆధ్యాత్మిక సముదాయంగా అభివృద్ధి చేసిందనీ ఎందుకంటే చెట్టు, ఆల యం ఆకట్టుకునే కలయికగా ఉన్నాయన్నారు. ఈ పవిత్రమైన మర్రి చెట్టు యొక్క వైభవం దాని అనేక ఊడలు, కొమ్మలు మరియు పచ్చదనంతో నిండిన విశాలమైన విస్తీర్ణంలో ఉంది. ఇది భారతదేశంలోనే పురాతనమైన జీవన మర్రి చెట్టని అన్నారు. పోటీదారులు తమ ప్రయత్నాలలో విజయం సాధించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఇక్కడి సంస్కృతి, సంప్రదాయాలు, పర్యాటక ప్రాంతాలను ప్రపంచ వ్యాప్తంగా ప్రచారం చేయాలని కోరారు. పర్యాటకం అనేది కేవలం పర్యాటకులకు మాత్రమే కాదని ఎంతో మందికి స్వయం ఉపాధి, ప్రాంత సామాజిక అభివృద్ధికి దోహదపడతాయని అన్నారు.

## మా పిల్లలమర్రిని గుర్తుంచుకోండి..

### ప్రపంచానికి పరిచయం చేయండి.. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి



పిల్లల మర్రి చెట్టు ఎంతో చరిత్ర కలిగిన మహా వృక్షం అని, పిల్లలమర్రిని గుర్తుంచుకొని తమ తమ దేశాల్లో ఇక్కడి ప్రత్యేకతను చాటి చెప్పాలని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ప్రపంచ సుందరీమణులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రపంచ విశ్వ సుందరి పోటీదారులు శుక్రవారం మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని 700ల సంవత్సరాలకు పైగా చరిత్ర కలిగిన పిల్లల మర్రి మహావృక్షాన్ని వారు సందర్శించారు. అంతకుముందు మిస్ వరల్డ్ పోటీదారులకు జిల్లా యంత్రాంగం ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మహబూబ్ నగర్ ఎమ్మెల్యే మాట్లాడు తూ ఎన్నో శతాబ్దాలుగా ఇబ్బందులు ఎదుర్కొని, వాటినన్నిటిని అధిగమించి 7 వందల సంవత్సరాలు ఈ మహావృక్షం తన మనుగ డ సాగించింది. ఇంకా 7 వందల సంవత్సరాలు అయినా ఈ మర్రి మహా వృక్షం ఇలాగే ఉంటుందని ఆయన ఆశాభా వం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజలు ఎన్నో దశాబ్దాలుగా పోరాటం చేసి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని ఆయన చెప్పారు. తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిని, సంప్రదాయాలను ప్రపంచ వ్యాప్తం చేయుటకు ఇది మంచి అవకాశం అని ఆయన స్పష్టం చేశారు. కాకతీయ వైభవం, వెయ్యి స్థంభాల గుడి, రామప్ప దేవాలయం మాదిరిగా ఈ పిల్లల మర్రి మహావృక్షం కూడా చాలా చారిత్రాత్మకమైనదని ఆయన చెప్పారు. ఈ ప్రాంతాన్ని మీరు సందర్శించడం మేము గౌరవంగా భావిస్తున్నామని, మా తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక సాంప్రదాయాలు ఎంతో గొప్పవని, వాటిని మీరు గుర్తు పెట్టుకోవాలని ఆయన సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో పిల్లల మర్రిని మరింతగా అభివృద్ధి చేస్తున్నామని ఆయన తెలిపారు.

### వర్ష కాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల నివారణపై

## ప్రత్యేక శ్రద్ధ వహించాలి : కలెక్టర్



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

**వనపర్తి టౌన్, మే 16 ప్రభాత వార్త:** వర్ష కాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల నివారణ కార్యక్రమాల నిర్వహణ పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. జాతీయ డెంగ్యూ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.అల్లె శ్రీనివాసులు అధ్యక్షతన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం జిల్లాల్లోని జిల్లా అధికారులకు, ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల డాక్టర్లకు, ప్రైవేట్ డయాగ్నోస్టిక్ పరీక్ష కేంద్రాల ల్యాబ్ టెక్నీషియన్లకు సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వర్ష కాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల నివారణ కార్యక్రమాల నిర్వహణ పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, అన్ని ప్రభుత్వ శాఖల అధికారుల మధ్య సమన్వయంతో పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణ బాధ్యత వహించాలని సూచించారు. వ్యాధి కారకం గుర్తించి అవసరమైన స్వతర చర్య వల్ల వ్యాధిని నిరోధించవచ్చునని తెలిపారు. నీటి నిలువ ఉండే ప్రదేశాలను, మురికి కాలువలు ఎప్పటికపుడు పరిశుభ్రం చేయాలని, పాత టైరులు, సీసాలు, డబ్బులు, కొబ్బరి బొండలలో నీటి నిలువ లేకుండ చూడాలని అన్నారు. ప్రతి శుక్రవారం పారిశుధ్య, పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం వర్ష కాలంలో వచ్చే సీజినల్ వ్యాధుల పట్ల అవగాహన కార్యక్రమాలు చేయాలని సూచించారు. రానున్న వర్ష కాలంలో మంగళవారం శుక్రవారం పరిసరాల పారిశుధ్య నిర్వహణ కార్యక్రమాలు చేపట్టాలని పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులలో డెంగ్యూ రాపిడ్ టెస్టులు ఎక్కువగా చేయాలనీ, రాపిడ్ టెస్టు పాజిటవ్ వచ్చిన వారికి ఏలిసా టెస్టు ఖచ్చితంగా చేయించుటపై శ్రద్ధ వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జిజిహెచ్ సూపరింటెండెంట్ డా. రంగారావు, డిసిహెచ్ఎస్ డా. చైతన్య గౌడ్, ఉప జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.బండారి శ్రీనివాసులు, ప్రొగాం అధికారి డా. సాయి నాథ్ రెడ్డి, ఇతర ప్రోగ్రామ్ అధికారులు డా రామచంద్రరావు, డా.జాన్సి, డా.పరిమళ, డా.మంజుల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, ప్రైవేట్ ఆసుపత్రుల డాక్టర్లు, ఆరోగ్య సిబ్బంది, ల్యాబ్ నిర్వాహకులు, ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొన్నారు.

### నేటి శిక్షణ కార్యక్రమాలు రాబోయే

## విద్య సంవత్సరంలో ప్రతిబింబించాలి



**నారాయణపేట టౌన్, మే 16 ప్రభాత వార్త :** నేటి శిక్షణా కార్యక్రమాలు రాబోయే విద్యా సంవత్సరంలో ప్రతిబింబించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలో గురుకుల పాఠశాలలో నిర్వహిస్తున్నటువంటి ఉపాధ్యాయుల వృత్యంతర శిక్షణకు హాజరైన జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో అమలు జరుగుతున్నటువంటి మౌలిక భాషా గణిత సామర్థ్యాల సాధన కార్యక్రమంలో గుర్తించిన అంతరాలను పూరించడం, అభ్యసన ఫలితాలపై పూర్తి పట్టు సాధించే విధంగా రాష్ట్రస్థాయిలో పొందిన శిక్షణను తరగతిగదికి తీసుకెళ్లాల్సిన బాధ్యత మనందరిపై ఉందనే విషయాన్ని తెలియజేస్తూ, ఉపాధ్యాయులంతా తరగతి గదికి నిత్య నూతనంగా వెళ్లాలని సూచించడం జరిగింది. నేటి శిక్షణా కార్యక్రమాలు రాబోయే విద్యా సంవత్సరంలో తరగతి గదులలో ప్రతిబింబించాలి. ఈ మార్పులతో ప్రభుత్వ పాఠశాలల్లో ఘననీయమైనటువంటి విద్యార్థుల నమోదుతో పాటు గుణాత్మక విద్యలో సమూల మార్పులు తెచ్చి నారాయణపేట జిల్లాకు మంచి పేరు తేవాలని సూచించడం జరిగింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్నటువంటి శిక్షణ కార్యక్రమం గొప్ప అవకాశంగా భావించి మీమీ పాఠశాలలో అమలుపరుస్తున్న బెస్ట్ ప్రాక్టీస్‌ను, మీ అనుభవాలను పంచుకోవడం ద్వారా మీ నైపుణ్యాలను మరింత పెంపొందించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా అవకాశం ఉన్నప్పుడల్లా అనుభవజ్ఞులైన అతిథి సందేశాలను ఇప్పించాలని కోరడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా డిఎంహెచ్ఓ మోహన్ ఉపాధ్యాయులకు ఇచ్చిన ప్రేరణాత్మక సందేశమును మెచ్చుకోవడం జరిగింది. తదనంతరము నారాయణపేట ఎస్సై వెంకటేశ్వర్లు శిక్షణ శిబిరంలో మానవ అక్రమ రవాణాకు సంబంధించిన పల విషయాలను అందుకు గల కారణాలను వాటిని అరికట్టడానికి తీసుకోవాల్సిన చర్యలను మధ్యాహ్నం నారాయణపేట సిఐ శివశంకర్ ట్రాఫిక్ రూల్స్, మాదక ద్రవ్యాల నివారణపై ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులకు నిత్యజీవితంలో జరిగే పలు ఉదాహరణల ద్వారా వివరించడం జరిగింది. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మక్తల్ సిఐ రామ్‌లాల్ శిక్షణ శిబిరాన్ని సందర్శించి నేటి సమాజంలో అత్యంత ఇబ్బందికరంగా మారిన సైబర్ క్రైమ్ గురించి పిపిటిల ద్వారా ప్రజెంటేషన్ ఇస్తూ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి గోవిందరాజులు, కోర్సు పరిశీలకులు గద్వాల్ డీఈవో మహమ్మద్ సిరాజ్, సీఎంఓ రాజేంద్ర కుమార్, ఏఎంఓ విద్యాసాగర్, బాలాజీ, బాలకిష్టప్ప వివిధ సబ్జెక్టుల డిఆర్పీలు పాల్గొన్నారు.



శిక్షణకు హాజరైన సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్

### ఇందిర సౌరగిరి జల వికాస పథకం ద్వారా

## ఆర్థిక స్వావలంబన

- ఇందిర సౌరగిరి జల వికాస పథకం పైలట్ ప్రాజెక్టు ప్రారంభానికి ముమ్మర ఏర్పాట్లు
- గిరిజన రైతులకు సౌర నీటిపారుదలతో సుస్థిర సాగు
- నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్



పనులను పర్యవేక్షిస్తున్న జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మే 16 ప్రభాతవార్త:** అటవీ హక్కుల చట్టం ఆర్ఓఎఫ్ఆర్ కింద భూమి హక్కులు కలిగి ఉన్న గిరిజన రైతుల ఆర్థిక మరియు జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి ఇందిర సౌ రగిరి జల వికాసపథకాన్ని తెలంగాణరాష్ట్రంలో పైలెట్‌ప్రాజెక్టుగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తున్నారని జిల్లాకలెక్టర్ బాదావత్‌సంతోష్ పేర్కొన్నారు. అచ్చంపేట నియోజకవర్గం పరిధిలోని అమ్రాబాద్ మండలం మాచారం గ్రామంలో ఇందిర సౌరగిరి జలవికాసం పథకానికి పైలట్‌ప్రాజెక్టు ప్రారంభపనులు వేగవంతంచేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిర సౌరగిరి జల వికాస పథకం ద్వారా రాష్ట్రంలోని 2.10లక్షల మంది గిరిజన రైతుల భూములకు విద్యుత్, సాగునీటి సౌకర్యాలను కల్పించనున్నట్లు తెలిపారు. మాచారం గ్రామంలో పైలట్ ప్రాజెక్టు ద్వారా ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు కలిగి ఉన్న 27మంది గిరిజన రైతుల 50ఎకరాలకు సౌరశక్తితో కూడిన నీటిపారుదల అందించడానికి 16బోర్లను వేసి స్ప్రింక్లర్ల ద్వారా నీటినందించేందుకు ఏర్పాటు చేశారు. ప్రభుత్వం గిరిజన రైతుల ఆర్థిక మరియు జీవన ప్రమాణాలను పెంపొందించే ప్రయత్నాలలో భాగంగా ఆర్ఓఎఫ్ఆర్ చట్టం ద్వారా అందించిన గిరిజనుల భూముల్లో పళ్ళతోటల పెంపకం, అంతర్గత పంటలు, ద్వారా వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసు కుంటున్నట్లు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న ఇందిర సౌరగిరి జల వికాస పథకం ద్వారా గిరిజనులు తమ భూములను సాగు చేసుకోవడానికి ఎంతో ఉపయోగపడుతుందని గిరిజనులో గణనీయ మైన ఆర్థికంగా అభివృద్ధి చెందుతారన్నారు. ఇందిర సౌరగిరి జల వికాస పథకంలో సౌరశక్తితో నడిచే నీటిపారుదల సౌకర్యం మాత్రమే కాకుండా, బిందు సేద్యం ద్వారా ఉద్యానవన పంటలకు మద్దతుతో నిమ్మ మొక్కలు, బత్తాయి మొక్కలు, మామిడి మొక్కలు, అవకాడ మొక్కలు, కొబ్బరి మొక్కలు, వెదురు మొక్కలను నాటి శాశ్వత దిగుబడి ప్రారంభమయ్యే వరకు ఇతర పంటల ద్వారా మధ్యంతర ఆదాయ మద్దతు కూడా అందించేందుకు ఈ పథకం ద్వారా చర్యలు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు. ప్రత్యామ్నాయ పంటలైన అవకాడో, వెదురు, దానిమ్మ డ్రాగన్ ఫ్రూట్ అంజీర్ వంటి పంటలు గిరిజనులు సాగు చేసేందుకు కార్యచరణ రూపొందించుకొని ఉద్యాన శాఖ అధికారులు గిరిజన రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దేవసహాయం, మన్ననూర్ ఐటీడీఏ పీవో రోహిత్ గోపిడి, డీటీడీవో ఫిరంగి, డీపీవో మోహన్ రావు, జిల్లా ఉద్యానవన అధికారులు జగన్, లక్ష్మణ్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియ జరగాలి

**గద్వాల, మే 16, ప్రభాతవార్త:** కలగకుండా సాఫీగా కొనుగోలు ప్రక్రియ పూర్తయ్యేలా అధికారులు అంకితభావం తో కృషి చేయాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుండి పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావుతో కలసి వరి ధాన్యం కొనుగోలుపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దాన్యం సేకరణ సాఫీగా చేపట్టాలన్నారు. అకాల వర్షాలు కురుస్తునందున ధాన్యం తడిసిపోకుండా టార్పాలిన్లను అందుబాటులో ఉంచాలన్నారు. అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తూ కొనుగోలు చేసిన ధాన్యాన్ని వాహనాలలో లోడింగ్ చేసి ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యానికి వెంటనే డబ్బులు చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని ఇందుకు జిల్లా కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ జరపాలం అన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ మాట్లాడుతూ, జిల్లాలో ధాన్యం సేకరణ ప్రక్రియ ఎలాంటి అవంతరాలకు తాగులేకుండా సాఫీగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో కనీవిని ఎరగని రీతిలో ఈసారి 1.38 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అంచనా ఉందన్నారు. ఇప్పటికే 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించి రైతుల ఖాతాలకు ఎప్పటికప్పుడు డబ్బులు జమ చేయడం జరుగుతుందన్నారు. మరో 88 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాల్సి ఉందని తెలిపారు. గత సంవత్సరంతో పోల్చుకుంటే 15, మే 20224 లో జిల్లా మొత్తంలో 2, 109 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించి రూ. 5.65 కోట్ల రూపాయలను రైతులకు చెల్లించడం జరిగిందని, ఈసారి ఇప్పటికే 50,834 ధాన్యం సేకరించి రూ. 55.89 లక్షల రూపాయలు చెల్లించడం జరిగిందని తెలిపారు. కొనుగోలు కేంద్రాలకు వరి ధాన్యం ఉప్పలు తిప్పలుగా రావడం చూస్తే గతం కన్నా 2,500 శాతం ఎక్కువ ధాన్యం సేకరించనున్నట్లు కలెక్టర్ ఈ సందర్భంగా తెలియజేశారు. ధాన్యం ఎంత వచ్చినా ప్రభుత్వం చివరి గింజ వరకు కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉండని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా అదనపు కలెక్టర్లు లక్ష్మీ నారాయణ, నర్సింగరావు, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ విమల, జిల్లా కో ఆపరేటివ్ అధికారి శ్రీనివాస్, జిల్లా మార్కెటింగ్ అధికారి పుష్పమ్మ, వ్యవసాయ శాఖ అధికారి సక్రియ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్

## డెంగ్యూ వ్యాధి నివారణపై అవగాహన ర్యాలీ

**డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ భీమానాయక్**

**కల్వకుర్తి, మే 16 ప్రభాతవార్త:** ప్రతి ఒక్కరూ తమ ఇంటి ఆవరణలో గల నీటిలో దోమల లార్వాలు ఉన్నాయా లేదా పరీక్షించుకుని, ఆ నీటిలో లార్వాలను తొలగించి శుభ్రపరచుకొని, ఇంటిలో నిలువ ఉంచుకునే నీటి పాత్రలపై మూతలు పెట్టుకోవడం ద్వారా డెంగ్యూ వ్యాధి కారక దోమల పెరుగుదలను అరికట్టడం ద్వారా డెంగ్యూ వ్యాధిని నివారించవచ్చునని డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ భీమానాయక్ పేర్కొన్నారు. కల్వకుర్తి పట్టణంలో జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవ సందర్భంగా శుక్రవారం డిప్యూటీ డీఎంహెచ్ఓ పరిధిలో అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డెంగ్యూదినోత్సవం సందర్భంగా ర్యాలీద్వారా అవగాహన కల్పించేందుకు ర్యాలీ ముఖ్య ఉద్దేశ్యమని, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. ఈర్యాలీకి రఘుపతిపేట్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్య సిబ్బంది, కల్వకుర్తి క్లస్టర్ వైద్య సిబ్బందిలు పాల్గొన్నారు. అదే విధంగా మండలంలోని తోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అవగాహన ర్యాలీలో మెడికల్ అధికారి జ్యోతి, డాక్టర్ శరత్ కుమార్‌రెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.


కల్వకుర్తిలో నిర్వహిస్తున్న అవగాహన ర్యాలీ

## అర్హులైన లబ్ధిదారులకు మాత్రమే ఇందిరమ్మ ఇండ్లు

**జిల్లా హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఉద్ధం భాస్కర్**

**నవాబుపేట, 16 మే ప్రభాతవార్త:** ఇందిరమ్మ ఇండ్లు అర్హులైన పేదలను గుర్తించాలని హౌసింగ్ డిపార్ట్‌మెంట్ (పిడి) భాస్కర్ ఆదేశించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్లు పథకంలో భాగంగా శుక్రవారం కొల్లూరు గ్రామపంచాయతీలోని ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల స్థలాలలో ముగ్గు పోసి ప్రారంభించారు. ఎంపిక జరుగుతున్న తీరును ఆయన పరిశీలించారు. అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని లబ్దిదారుల వివరాలు ఇంటింటికీ తిరిగి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా లబ్దిదారులతో హౌసింగ్ పిడి మాట్లాడారు. లబ్ధిదారుల కుటుంబ ప్రస్తుత నివాస స్థితిగతులు, వారి ఆర్థిక పరిస్థితుల గురించి తెలుసుకున్నారు. లబ్దిదారుల ఎంపిక వివరాల గురించి తెలుసుకున్నారు. నిజమైన లబ్దిదారుల దగ్గరకు అధికారులు వచ్చి వివరాలను సేకరించి ఎంపిక చేయడం జరుగుతుందని అన్నారు. ఇల్లులేని పేద వారిని గుర్తించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.


ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని ముగ్గుపోసి ప్రారంభిస్తున్న దృశ్యం

## హజ్ యాత్రకు వెళ్తున్న ఖయ్యూంకు సన్మానం

**భూత్పూర్,మే 16,ప్రభాతవార్త :** మరో వారంలో పవిత్ర మక్కా,మదీనా హజ్ యాత్రకు బయలుదేరి వెళ్తున్న భూత్పూర్ పట్టణంలోని నాల్గోవార్డు ఇందిరానగర్‌లో నివాసముంటున్న మొహ్మద్ ఖయ్యూంను శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు పూలమాలలు,శాలువలతో ఘనంగా సన్మానించారు. ఖయ్యూం హజ్ యాత్ర సజావుగా సాగాలని ఆకాంక్షిస్తూ ఖయ్యూం శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు,మున్సిపల్ మాజీ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్,సింగిల్ విండో చైర్మన్ కదిరే అశోక్‌రెడ్డితో పాటు పార్టీ నాయకులు సత్తూర్ నారాయణగౌడ్,సత్తూర్ చంద్రశేఖర్‌గౌడ్,తూము శ్రీనివాస్‌రెడ్డి,మొహ్మద్ సాధిక్,మొహ్మద్ అహ్మద్,గడ్డం రాములు,మొహ్మద్ ఖదీర్,మొహ్మద్ ఇబ్రహీం,మొహ్మద్ నయూం,మొహ్మద్ జహంగీర్, మూసమొహ్మద్ ఇసాక్ తదితరులు సన్మానించినవారిలో ఉన్నారు.అంతకు ముందు బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు టి మురళీధర్‌గౌడ్ హజ్‌కు వెళ్తున్న ఖయ్యూంను ప్రత్యేకంగా సన్మానించి అభినందనలు తెలిపారు.టీఎంగౌడ్ వెంట అబ్దుల్ వహీద్ తదితరులు ఉన్నారు.

## జర్నలిస్టుగా నిబద్ధతగా పనిచేసిన తాహెర్

**టియుడబ్ల్యూజె (హెచ్ 143) నాయకులు జర్నలిస్ట్ తాహెర్‌కు ఘన నివాళి**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మే 16 ప్రభాతవార్త:** రాష్ట్రీయ సహారా ఉర్దూ దినపత్రిక నాగర్‌కర్నూల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మహమ్మద్ తాహెర్ నిజామీ జర్నలిస్టుగా నిబద్ధతగా వ్యవహరించే వారని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (హెచ్ 143) నాయకులు అన్నారు. నాగర్‌కర్నూల్ నియోజకవర్గానికి చెందిన రాష్ట్రీయ సహారా ఉర్దూ దినపత్రిక రిపోర్టర్ మహమ్మద్ తాహెర్ నిజామి గురువారం రాత్రి మృతి చెందడంతో ఆయన భౌతిక కాయానికి ఆ సంఘం తరఫున ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర నాయకులు అబ్దుల్లా ఖాన్, జాతీయ నాయకుడు ఉమా శంకర్, టియుడబ్ల్యూ (హెచ్ 143) జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ రావు, ప్రధాన కార్యదర్శి రాజేష్ గౌడ్, తెలంగాణ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్ సంఘం జిల్లా అధ్యక్షుడు ఖానాపురం ప్రదీప్ ఆధ్వర్యంలో ఘన నివాళులు అర్పించి జర్నలిస్టులుగా ఆయన అందించిన సేవలను కొనిఆడారు. వీరితోపాటు యూనియన్ నాయకులు స్థానిక జర్నలిస్టులు, ఏటిగడ్డ వెంకటేష్, మొహమ్మద్ సాదిక్,జంగిటి రాజేష్, మహమూద్, 19 టీవీ శేఖర్,మహమ్మద్ రియాజ్ తదితరులు ఉన్నారు.

## డెంగ్యూని అరికట్టవలసిన బాధ్యత అందరిపై ఉంది

**ఉట్కూరు,మే16 ప్రభాతవార్త :** ఉట్కూరు మండల కేంద్రంలో డెంగ్యూ నివారణ దినం సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రము ఉట్కూరు మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద డెంగ్యూ నివారణ ప్రతిజ్ఞ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వైద్య అధికారి డా.ఆర్.సంతోషి మాట్లాడుతూ దోమ కాటువల్ల ఈ డెంగ్యూ వ్యాధి రావడం జరుగుతుందని నివారణలో భాగంగా ప్రతి ఒక్కరూ సాయంత్రం పూట దోమతెరలు వాడాలని బట్టలు కూడా పూర్తిగా శరీరాన్ని కప్పే విధంగా ధరించాలని ఎక్కడా కూడా మురికి నీరు ఆగకుండా చూడాలని రాబోయే వర్షాకాలంలో ఇంట్లో గాని ఇంటి చుట్టు ముట్టు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని నీటిని ఎప్పటికప్పుడు వారానికి ఒకసారి మారుస్తూ ఉండడం వల్ల దోమలు కుట్టకుండా ఉంటాయని సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పిలు డా.భవాని, నర్సింగమ్మ, ఆరోగ్య పర్యవేక్షకులు నరసింహులు ఆరోగ్య కార్యకర్తలు గోవిందమ్మ, సుజాత, కవిత, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.


డెంగ్యూ నివారణ దినోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

## సిఎం సహాయ నిధి పేదలకు వరం

**గండీడ్ ,మే 16 ప్రభాతవార్త;** ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరం లాంటిదని మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తూర్పు అశి రెడ్డి అన్నారు. శుక్రవారం గండీడ్ మండలం జిన్నారం గ్రామపంచాయతీ లోని చెల్మిళ్ళ, జిన్నారం తండాలో పలువురికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిగి శాసనసభ్యులు డాక్టర్ టీ రామ్మోహన్ రెడ్డి చొరవతో సీఎం సహాయ నిధి నుండి గ్రామస్తులు దోబ్బలి లక్ష్మీ 28000 వేల రూపాయలు, సీతాబాయి 9కి 23,500 రూపాయల చెక్కులను అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు వెంకటరెడ్డి, తిమ్మారెడ్డి, గోపాల్, కృష్ణయ్య, చెల్మిళ్ల దస్తయ్య, నర్సింలు, వెంకటయ్య,దాసరి నర్సింలు, బాలయ్య, అంజయ్య, కావలి లక్ష్మయ్య, ఈటివి వెంకటయ్య గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## కూలీలకు రోజు రూ.600లు చెల్లించాలి

**వ్యవసాయ కార్మిక సంగం ఏఐపికెఎంస్ జిల్లా అధ్యక్షులు సలీమ్**

**ఉట్కూరు మే 16 ప్రభాతవార్త :** ఉట్కూరు మండల పరిధిలోని పులిమామిడి,పెద్దపొర్ల ఎస్‌కెఎం సయుంక్త కిసాన్ మోర్చా పిలుపులో భాగంగా, మే 20న దేశ వ్యాపిత జరిగే సార్వత్రిక సమ్మెను విజవంతం చేయాలని ఉద్దేశంతో గ్రామవీధుల్లో కరపత్రాల ద్వారా కార్నర్ మీటింగ్స్ నిర్వహిస్తూ ప్రచారంలో పులిమామిడి సెంటర్‌లో రైతు కూలిలను ఉద్దేశించి ఏఐపికెఎంస్ జిల్లా అధ్యక్షులు సలీమ్, ఎఐయుకెఎస్,అఖిల భారత ఐక్య రైతు సంఘం, జిల్లా ఉపాధ్యక్షులు జి. వెంకట్ రెడ్డి, బి. చంద్రాములు మాట్లాడుతూ కార్మికుల, రైతుల, వ్యవసాయ కూలీల ప్రజలకు, కేంద్ర ప్రభుత్వం వ్యతిరేక విధానాలు చట్టాలు అమలు చేయడం వల్ల అన్ని రంగాల్లో ప్రజల జీవితాలు దుర్భరంగా మారాయన్నారు. రైతులకు ఇచ్చిన హామీ స్వామి నాధన్ సిఫారసులను, గిట్టుబాటు ధరలు రాలేదు నెరవేర్చలేదు, ఉపాధికి నిధులు, పనిదినాలు తగ్గించారు. కూలీలకు రోజు కూలి రూ.600లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 200 పని దినాలు కల్పించాలన్నారు. వ్యవసాయ కూలీలకు సమగ్ర చట్టం చేయాలన్నారు. పెరిగే ధరలకనుగుణంగా కనీస వేతనం రూ.26 వేల కార్మికులకు అమలు చేయాలన్నారు.


కరపత్రాలు విడుదల చేస్తున్న దృశ్యం

# సమన్వయంతో ధాన్యం కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయాలి

**గద్వాల, మే 16 ప్రభాతవార్త :** ధాన్యం కొనుగోలు ప్రక్రియను సమన్వయంతో వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐడీఓసీ కాన్ఫరెన్స్ హాల్ నందు వరి ధాన్యం కొనుగోలుపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, వర్షాలు పడే అవకాశమున్న నేపథ్యంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ధాన్యం తేమ శాతం 17 కు చేరగానే సంచుల్లో నింపి, లారీలలో వెంటనే లోడ్ చేసి మిల్లులకు తరలించాలని ఆదేశించారు. కేంద్రాలవారీగా గన్ని బ్యాగులు, లారీల అవసరాన్ని ముందుగా పౌరసరఫరాల జిల్లా మేనేజర్‌కు తెలియజేసి, సమర్థవంతమైన ప్రణాళికతో సరఫరా జరిగేలా చూడాలన్నారు. కొనుగోలు కేంద్రాల వారీగా ధాన్యం మోతాదుతో పాటు జారీ చేసిన టోకెన్ల వివరాలను వ్యవసాయ విస్తరణాధికారుల నుండి సేకరించి, తేమ శాతం వచ్చిన వెంటనే టోకెన్లు జారీ చేయాలని మండల వ్యవసాయ అధికారులను ఆదేశించారు. గన్ని బ్యాగులు, లారీల కొరత ఏర్పడకుండా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని పౌరసరఫరాల జిల్లా మేనేజర్ ఆదేశించారు. రైస్ మిల్లుల వద్ద ధాన్యం ధాన్యం తరలింపులో జాప్యం జరుగకుండా వాహనాలను వెంటనే తరలించాలని సూచించారు. అకాల వర్షాలకు ధాన్యం తడిసిపోకుండా సరిపడా సంఖ్యలో టార్పాలిన్లు సమకూర్చుకోవాలని అన్నారు. ధాన్యం రవాణాకు అవసరమైన లారీలను సమకూర్చాలని రవాణా అధికారిని ఆదేశించారు. ట్రక్ షీట్ వచ్చిన వెంటనే ఓపియంఎస్ లో డాటా ఎంట్రీని వెంటనే పూర్తి చేసి, రైతులకు తక్షణమే డబ్బులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యం సేకరణ ప్రక్రియలో క్షేత్రస్థాయి సిబ్బంది మొదలుకుని అధికారుల వరకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పని చేసి, రైతులకు ఇబ్బందులు కలుగకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియ సాఫీగా పూర్తయ్యేలా అధికారులందరూ సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు లక్ష్మీ నారాయణ, నర్సింగ రావు, జిల్లా పౌరసరఫరాల అధికారి స్వామి కుమార్, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ విమల, మార్కెటింగ్ అధికారి పుష్పమ్మ, వ్యవసాయ అధికారి సక్రియ నాయక్, అడిషనల్ డి.ఆర్.డి.ఓ నర్సింహులు, మండల వ్యవసాయాధికారులు, ఏపియం లు తదితరులు పాల్గొన్నారు.


అధికారులతో సమీక్ష చేస్తున్న జిల్లా కలెక్టర్ సంతోష్

# డెంగ్యూ నివారణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

- జాతీయ డెంగ్యూ దినోత్సవ అవగాహన ర్యాలీ
- ఇన్‌చార్జి జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రవికుమార్ నాయక్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మే 16 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ కార్యాలయ (పాత కలెక్టరేట్ కార్యాలయం) ప్రాంగణంలో ఇన్‌చార్జి జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రవికుమార్‌నాయక్ ఆధ్వర్యంలో జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవ అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. డెంగ్యూ వ్యాధి లక్షణాలు, నివారణ గురించి ప్రతి ఒక్కరికి అవగాహన కలగాలనే ప్రధాన ఉద్దేశంతో ఈ ర్యాలీ నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఓ మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థ నినాదం ప్రకారం ప్రతి ఒక్కరూ తమ ఇంటి ఆవరణలో గల నీటిలో దోమల లార్వాలు ఉన్నాయా లేదా పరీక్షించుకుని, ఆ నీటిలో లార్వాలను తొలగించి శుభ్రపరచుకొని, ఇంటిలో నిలువ ఉంచుకునే నీటి పాత్రలపై మూతలు పెట్టుకోవడం ద్వారా డెంగ్యూ వ్యాధి కారక దోమల పెరుగుదలను అరికట్టడం ద్వారా డెంగ్యూ వ్యాధిని నివారించుకోగలమని తెలిపారు. డెంగ్యూ వ్యాధి ఫ్లెవి వైరస్ కారక క్రిమికాటక టైగర్ దోమ (ఎడీస్ ఈజిప్ట్) కుట్టడం ద్వారా మనుషులకు సోకుతోందని, దోమ కుట్టిన తర్వాత 3,4 రోజులకు విపరీతమైన జ్వరము, తలనొప్పి, కంటి వెనుక భాగంలో తీవ్రమైన నొప్పి, కండరాలు మరియు కీళ్లనొప్పి, వాంతులు, విరేచనాలు, శరీరంపై ఎర్రటి దద్దుర్లు తదితర లక్షణాలతో బాధపడుతూ ఉంటారని, ఈ లక్షణాల దశలోనే ఇంటిలోని ద్రావణాలను, ఓఆర్ఎస్ ద్రావణాలను తీసుకోవడం, జ్వరం తగ్గడానికి పారాసెటమాల్ మాత్రలు వేసుకోవడం ద్వారా డెంగ్యూ వ్యాధిని సులభంగా తగ్గించుకోవచ్చునన్నారు. ప్రాథమిక దశలో నిర్లక్ష్యం చేసినచో శరీరంలోని వివిధ అవయవాలు ముఖ్యంగా మూత్రపిండాలు, కాలేయము, మెదడు, గుండె తదితర అవయాలపై ప్రభావితం చూపుతుందన్నారు. కావున ప్రాథమిక లక్షణాల దశలోని దగ్గర్లోని ఆరోగ్య కేంద్రానికి వెళ్లి డెంగ్యూ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసుకుని వైద్యాధికారి సూచనలు పాటించాలన్నారు. గ్రామ మరియు పట్టణ ప్రాంతాల్లోని ప్రజలు తమ ఇంటి ఆవరణలో పనికిరాని టైర్లు, కొబ్బరి చిప్పలు, ప్లాస్టిక్ సీసాలు, గ్లాసులు, డబ్బాలు లేకుండా తొలగించుకోవాలని, వారానికి ఒకసారి ప్రతి శుక్రవారం ఇంట్లో గల నీటి తొట్టెలు, ప్లాస్టిక్ డ్రమ్ములు, కుండలు, బకెట్లలోని నీటిని తొలగించి కొబ్బరి పీచుతో గట్టిగా రుద్ది శుభ్రపరచుకుని ఆరబెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ డివిజన్ ఉప జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటదాస్, అసిస్టెంట్ మలేరియా అధికారి ఆర్.శ్రీనివాసులు, పెద్ద ముద్దునూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ వాణి, డిపిఓ రేణయ్య, డిపిఎంఓ సుకుమార్ రెడ్డి, ఎంఎల్ హెచ్‌పిలు నీరజ్, సాయి, ఎంపిహెచ్ఈఓలు పసియుద్దిన్, రాజేష్, విజయ్ కుమార్, నిరంజన్, పర్యవేక్షకులు జ్యోతి, బంగారయ్య, డివిఎల్ఎం కుమార్, ల్యాబ్ టెక్నీషియన్ కళ్యాణ్, ఆరోగ్య కార్యకర్త రమేష్ రెడ్డి, రాజవర్ధన్ రెడ్డి, శ్రీనివాసులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు ఉన్నారు.


జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న దృశ్యం

### జిల్లాలో లక్ష్యం మేరకు ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల

## ఎంపిక పూర్తి చేయాలి: అధికారులకు కలెక్టర్ సంతోష్

**గద్వాల, మే 16,ప్రభాతవార్త:** జిల్లాలో లక్ష్యం మేరకు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐ.డి.ఓ.సి. కాన్ఫరెన్స్ హాల్‌లో ఇందిరమ్మ ఇండ్లు,రాజీవ్ యువ వికాసం పథకం పై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని అన్నారు.గ్రామ పంచాయతీ వారీగా లబ్దిదారుల ఎంపికను త్వరగా పూర్తిచేసి, ఎంతమందికి ఇళ్లు కేటాయించారో, ఎంతమందిని అర్హులుగా గుర్తించారో, ఎంతమందిని నిరాకరించారో స్పష్టమైన జాబితా తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. అర్హత లేనివారి నిరాకరణకు గల కారణాలను కూడా జాబితాలో పేర్కొనాలని తెలిపారు.ఎంపీడీవోలు ప్రత్యేక అధికారులతో సమన్వయం చేసి ఇందిరమ్మ ఇళ్ల పరిశీలనను పూర్తిచేయాలని సూచించారు.రాజీవ్ యువ వికాసం పథకం కోసం వచ్చిన దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ ఆదేశించారు. రాజీవ్ యువ వికాసం పథకం లబ్దిదారుల ఎంపిక పూర్తి పారదర్శకంగా జరగాలని,ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రాధాన్యత క్రమంలో ఎంపిక జరగాలని అన్నారు.ప్రతి దరఖాస్తును జాగ్రత్తగా పరిశీలించి అర్హత ఉన్నవారిని మాత్రమే ఎంపిక చేయాలని అధికారులకు సూచించారు.జిల్లాలోని అధికారులు,బ్యాంకర్లు సమన్వయంతో పనిచేస్తూ, నిర్దేశించిన లక్ష్యాలను సాధించే దిశగా కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు లక్ష్మీ నారాయణ,నర్సింగ రావు,డిపిఓ నాగేంద్రం, ఈ.డి ఎస్సీ కార్పొరేషన్ రమేష్ బాబు,ఎల్డీయం శ్రీనివాస రావు,మున్సిపల్ కమిషనర్లు,ఎంపిడిఓలు,స్పెషల్ ఆఫీసర్లు,తదితరులు పాల్గొన్నారు.


జిల్లా అధికారుల సమావేశంలో మాట్లాడు తున్న కలెక్టర్ సంతోష్

## టెక్స్‌టైల్స్ టెక్నాలజీ డిప్లొమా కోర్సులో ప్రవేశాల కొరకు అవగాహన

**గద్వాల మే 16,ప్రభాతవార్త:** హ్యాండ్లూమ్ 2025-26 విద్యా సంవత్సరానికిగాను హ్యాండ్లూమ్అండ్ టెక్స్‌టైల్స్ టెక్నాలజీ డిప్లొమాకోర్సులో ప్రవేశాల కొరకు అవగాహన కార్యక్రమం. ఈ రోజు ఉదయం 11:00 గంటలకు జోగులాంబ గద్వాల నందు నిర్వహించబడినదని చేనేత మరియు జౌళి శాఖ సహాయ సంచాలకులు గోవిందయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో అవగాహన కల్పించుటకు గిళీదివీ ప్రత్యేక అధికారి రతన్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మొత్తం 8 దరఖాస్తులు అందినట్లు ఆయన తెలిపారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్ లో మూడు సంవత్సరాల డిప్లొమా ఇన్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ కోర్సుకు రాష్ట్ర విద్యార్థులకు 60సీట్లు కేటాయించబడ్డాయని, మూడవ సంవత్సరంలో క్యాంపస్ సెలెక్షన్ ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పించబడతాయని తెలిపారు. ఈ కోర్సులో చేరిన విద్యార్థులకు నెలకు రూ.2500/ ఉపకార వేతనం రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తుందని, మరియు చేనేత కార్మికుల కుటుంబానికి చెందిన విద్యార్థులకు భారత ప్రభుత్వంచే అదనంగా నెలకు రూ.5000/ ఉపకార వేతనం ఇవ్వబడునని, కాలేజీ ఫీజు సంవత్సరానికి రూ.6000/ మరియు వసతి సదుపాయాలు కల్పించబడునని తెలిపారు. ఈ కోర్సు పూర్తి చేసిన వారికి పలు రకాల ఉద్యోగ అవకాశాలు ఉంటాయని పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు.ఈ కార్యక్రమంలో చేనేత మరియు జౌళి శాఖ అధికారులు, జోగులాంబ గద్వాల, వనపర్తి జిల్లాలోని చేనేత సంఘాల అధ్యక్షులు, మాస్టర్ వీవర్స్ మరియు తదితరులు పాల్గొన్నారు.


హ్యాండ్లూమ్ కోర్స్ పై అవగాహన కల్పిస్తున్న అధికారులు

## డెంగ్యూ వ్యాధి అవగాహన ర్యాలీ : డాక్టర్ ప్రవళిక

**పెబ్బేర్,మే 16 ప్రభాతవార్త :** పట్టణంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు డా.ప్రవళిక ఆధ్వర్యంలో జాతీయ డెంగ్యూదినోత్సవంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఈర్యాలీ ఆరోగ్యకేంద్రం నుంచి పురవీధుల గుండా సుభాష్‌చౌరస్తావరకు ర్యాలీ నిర్వహించి చౌరస్తాలో అవగాహనలో డా.ప్రవళిక మాట్లాడుతూ చాలా మందికి డెంగ్యూ ఇన్ఫెక్షన్ సంకేతాలు లేదా లక్షణాలు కనిపించవు. లక్షణాలు కనిపించినప్పుడు, అవి ఫ్లూ వంటి ఇతర అనారోగ్యాలుగా తప్పుగా భావించబడవచ్చు, సాధారణంగా మీకు సోకిన దోమ కుట్టిన నాలుగు నుండి 10 రోజుల తర్వాత ప్రారంభమవుతాయి. డెంగ్యూ జ్వరం అధిక జ్వరం 104ని (40సి),ఈ క్రింది సంకేతాలు, లక్షణాలలో ఏవైనా కలిగిస్తుంది: తలనొప్పి,కండరాలు,ఎముకలు లేదాకీళ్ల నొప్పి,వికారం,వాంతులు కళ్ళ వెనుక నొప్పి, ఉబ్బిన గ్రంథులు దద్దుర్లు,చాలా మంది వారం రోజుల్లోపు కోలుకుంటారు. కొన్ని సందర్భాల్లో, లక్షణాలు తీవ్రమవుతాయి. ప్రాణాంతకంగా మారవచ్చు.దీనిని తీవ్రమైన డెంగ్యూ,డెంగ్యూ హెమరేజిక్ జ్వరం లేదా డెంగ్యూ షాక్ సిండ్రోమ్ అంటారు.మీ రక్త నాళాలు దెబ్బతిన్నప్పుడు, లీకైనప్పుడు తీవ్రమైన డెంగ్యూ వస్తుంది. మీ రక్తప్రవాహంలో గడ్డకట్టే కణాల (ప్లేట్‌లెట్స్) సంఖ్య తగ్గుతుంది. ఇది షాక్, అంతర్గత రక్తస్రావం, అవయవ వైఫల్యం, మరణానికి కూడా దారితీస్తుంది. డెంగ్యూ వ్యాధిపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ముందుగా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని డాక్టర్ ప్రవళిక తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పిహెచ్ఎన్ లీలమ్మ, హెల్త్ సూపర్‌వైజర్ పార్వతి, హెల్త్ అసిస్టెంట్లు రాజశేఖర్,తిరుపతయ్య, ల్యాబ్ టెక్నీషియన్ విక్టర్ రాజు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


డెంగ్యూ వ్యాధిపై అవగాహన ర్యాలీ

## ఇసుక క్వారీ నీ రద్దు చేయాలని బిజెపి నాయకుల ధర్నా

**మిడ్జిల్, మే 16 ప్రభాతవార్త :** మండలంలోని కొత్తపల్లి గ్రామంలో శివారులోంచి ఇసుక తరలింపు అనుమతులను రద్దు చేయాలని బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.రాజేశ్వర్ బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పల్లె తిరుపతి ఆధ్వర్యంలో శుక్రవారం నాడు తహసిల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని అక్రమార్కులకు వత్తాసు పలుకుతూ మండలంలో కెనాల్ మొరము ఎర్రమట్టి మాఫియాకు దేవాలయ భూములకు తప్పుడు లీగల్ సర్టిఫికెట్లు ఇస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారని వెంటనే మిడ్జిల్ తాసిల్దారును సస్పెండ్ చేయాలని కొత్తపల్లి ఇసుక క్వారీ అనుమతులను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. లేకుంటే ధర్నాను ఉధృతం చేసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బుచ్చయ్య, వెంకటేశు, రామకృష్ణ, భీమయ్య, మల్లేష్, శేఖర్, అరవిందు, వాసుదేవ్ తదితరులు పాల్గొన్నారు.


ధర్నా నిర్వహిస్తున్న బిజెపి నాయకులు

## సబ్సిడీపై జీలుగ విత్తనాలు

**భూత్పూర్,మే16,ప్రభాతవార్త:** సబ్సిడీపై జీలుగ విత్తనాలు రైతు ఆగ్రోసేవా కేంద్రంలో 66బస్తాలు,భూత్పూర్ పీఏసీఎస్‌లో 100 బస్తాలు అందుబాటులో ఉన్నాయని భూత్పూర్ మండల వ్యవసాయాధికారి మురళిధర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. యాభై శాతం సబ్సిడీతో రెండున్నర ఎకరాలకు సరిపడే 30కిలోల బస్తాను రు.2138లకు రైతులకు ఇస్తున్నట్లు ఏఏఓ మురళిధర్ తెలిపారు.కావాల్సిన రైతులు తమ భూమి పట్టాదారు పాస్ పుస్తకంతో పాటు ఆధార్‌కార్డ్ జిరాక్స్ కాపీలతో మండల వ్యవసాయ విస్తరణాధికారిని సంప్రదించాలని ఆయన కోరారు.

## గొడుగు శంకరమ్మ మృతికి మున్సిపల్ మాజీ చైర్మన్ సంతాపం

**భూత్పూర్,మే 16,ప్రభాతవార్త :** భూత్పూర్ పట్టణానికి చెందిన గొడుగు శంకరమ్మ(80) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందగా,విషయం తెలుసుకున్న మున్సిపల్ మాజీ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్ మృతురాలి ఇంటికి వెళ్లి తన తీవ్ర సంతాపం తెలియజేస్తు,శంకరమ్మ మృతదేహం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. శ్రద్ధాంజలి ఘటించినవారిలో బీఆర్ఎస్ నాయకులు సత్తూర్ నారాయణగౌడ్,సత్తూర్ సురేష్‌గౌడ్,గొడుగు వెంకటరాజు,పులగుర్ల మల్లేష్,సత్తూర్ తిరుపతయ్యగౌడ్ ఇతర నాయకులు ఉన్నారు.

## కిట్ల పంపిణీ

**ఉప్పునుంతల, మే 16 ప్రభాతవార్త :** స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉప్పునుంతల వైద్యాధికారిణి డా. స్వప్న ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలకు కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి స్వప్న మాట్లాడుతూ ఆశలకు చిన్నారుల్లో అంగవైకల్యం రాకుండా తొలి దశలోనే గుర్తించి సరైన చికిత్స అందించడానికి అవసరమైన కిట్లు పంపిణీ చేయడం జరిగిందన్నారు.ఈ పంపిణీ కార్యక్రమంలో వైద్యాధికారిణి డా. స్వప్నతో పాటు డా. అభిలాష్, సూపర్‌వైజర్ ప్రభావతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## అంతిమ సంస్కారానికి ట్రాక్టర్ యూనియన్ ఆర్థిక సహాయం

**నవాబుపేట, మే16 ప్రభాతవార్త :** మండల పరిధిలోని లోకిరేవ్ గ్రామానికి చెందిన మాల నర్సమ్మ వీఆర్ఏ శుక్రవారం తెల్లవారు జామున తుది శ్వాస విడిచారు. నర్సమ్మ అకాల మరణానికి చింతిస్తూ గ్రామట్రాక్టర్ యూనియన్‌సభ్యులు కలిసి రూ.10,000 అంతిమ సంస్కరానికి ఆర్థిక సహాయంగా అందించారు. ఈకార్యక్రమంలో యూనియన్ సంఘంసభ్యులు కావలికృష్ణయ్య ఏకాంబరం,చారి,శివకుమార్‌గౌడ్,కలాల్, మల్లేష్, దుబ్బ సాయి, వడ్డేశివ,వంగూరు మల్లేష్, దర్పల్లి రామాంజు, వంగూరు,రాజు, దర్పల్లి శ్రీను తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## డెంగ్యూ నివారణ అవగాహన ర్యాలీ

**ఉప్పునుంతల, మే 16 ప్రభాతవార్త :** డెంగ్యూ జాతీయ నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వారి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి డా.స్వప్న మాట్లాడుతూ దోమల కాటుతో డెంగ్యూ వైరస్ వస్తుందని డెంగ్యూ వ్యాధి నివారణ కోసం ప్రజలు అవగాహన పెంచుకోవాలన్నారు. డెంగ్యూ నివారణ లక్ష్యమే ప్రధాన లక్ష్యమని ఆమె పేర్కొన్నారు. డెంగ్యూ వ్యాధి సోకిన వెంటనే స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని వైద్యాధికారిణి డా. స్వప్న అవగాహన కల్పించారు. ఈ అవగాహన ర్యాలీలో వైద్యాధికారిణి డా.స్వప్నతో పాటు డా.అభిలాష్,సూపర్‌వైజర్ ప్రభావతి,స్టాఫ్‌నర్స్ పతు, ఫార్మసిస్ట్ కుమారచారిసిబ్బంది రమేష్‌గౌడ్,శ్రీనివాసులు, శుభకర్, జగదీష్,ఎంఎల్ హెచ్‌పిసి, ఏఎన్ఎం దేవి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## పెబ్బేరులో ఇంటర్ డిస్ట్రిక్ క్రికెట్ సెలక్షన్స్

**పెబ్బేరు,మే16 ప్రభాతవార్త :** వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణంలో ఇంటర్ డిస్ట్రిక్ క్రికెట్ సెలక్షన్స్ అండర్ 19 అండర్ 23 ప్రాబబుల్స్ మహబూబ్‌నగర్ క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ ఆధ్వర్యంలో సెలక్షన్ కమిటీ మెంబర్‌గా వచ్చినటువంటి మానన్ చేతి సెలక్షన్స్ పెబ్బేరు పిజెపి క్రీడా ప్రాంగణంలో ఈసెలక్షన్స్ నిర్వహించారు.ప్రాబబుల్స్ పొందినటువంటి వారిని వనపర్తి జిల్లా టీంగా 2డేస్ లీగ్‌మ్యాచులు ఆడడం జరుగుతుంది. వనపర్తి జిల్లా టీం కోచ్‌గా శంకర్ నిర్వహించడం జరిగింది. లీగ్‌లు ఈనెల 19 నుంచి జూన్ 1 వరకు సెలక్షన్స్ నిర్వహించదం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు వేమారెడ్డి, ఇండియన్ గ్యాస్ బాలస్వామి, దయాకర్ రెడ్డి, డా. భరత్, సహదేవ్, పీఈటీలు కమలాకర్, మనోహర్, వీరందరి ఆధ్వర్యంలో సెలక్షన్స్ నిర్వహించామని క్రికెట్ కోచ్ శంకర్ తెలియజేశారు.

## త్వరలో రూ .14 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు

■జడ్చర్ల మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి



వార్డుల్లో పర్యటిస్తున్న కమిషనర్ లక్ష్మారెడ్డి, కౌన్సిలర్లు

**జడ్చర్ల, మే 16 ప్రభాతవార్త:** జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి ఆదేశాల మేరకు మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి వార్డ్ 4,9,10,15, 17వ వార్డులను సందర్శించారు. వార్డులలో వర్షం నీరు మురికి కాలువలను వారు సందర్శించి జెసిబి సాయంతో డ్రైనేజీలను శుభ్రం చేయించారు. త్వరలోనే పట్టణంలో రూ.14 కోట్లతో చేపట్టనున్న పనుల్లో డ్రైనేజీలను పూర్తిచేసి మురుగు ఎక్కడ నిలవకుండా రోడ్లమీదకి పారకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వార్డు సందర్శనలో భాగంగా 9వ వార్డు కృష్ణారెడ్డి ఇంటి వెనకాలి భాగంలో దాదాపు కాలనీ మురికి నీరు మొత్తం అక్కడ చేరుకొని డ్రైనేజీ లేక అస్తవ్యస్తంగా వెళ్తున్న దాన్ని సందర్శించి త్వరలో అక్కడ డ్రైనేజ్ ఏర్పాటు చేస్తామని కాలనీ వాసులకు తెలిపారు. తరువాత 10వ వార్డులోని రామచంద్ర పెట్రోల్ బంక్ బ్యాక్ సైడ్ డ్రైనేజీ పరిశీలించి మిగతా వార్డ్‌లో కూడా సందర్శించారు. ఈ కార్యక్రమంలో తొమ్మిదో వార్డ్ కౌన్సిలర్ చైతన్య చౌహన్, పదో వార్డ్ కౌన్సిలర్ కుమ్మరి రాజు, సానిటరీ ఇన్స్పెక్టర్ నాగేష్,కాలనీ యువకులు కమలంశేఖర్,సందీప్,పవన్,మణికంఠఅంజాద్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

## వర్షాల కారణంగా నష్టపోయిన ఇటుక బట్టిల యజమానులను ఆదుకోవాలి

**నారాయణపేట టౌన్, మే 16 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లాలోని గత రెండు, మూడు రోజులుగా అక్కడక్కడ అకాల వర్షాలతో ఇటుక బట్టీలు నేలపాలయ్యావని లక్షల రూపాయలు వెచ్చించి ఇటుకలు తయారు చేయిస్తున్న ఇటుకయజమానులకు తీవ్రనష్టం జరిగిందని సిపిఎం జిల్లా కార్యదర్శి జి.వెంకటరామిరెడ్డిశుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఆయన మాట్లాడు తూ అకాల వర్షాలతో నష్టపోయిన ఇటుక బట్టి యజమానులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

## పేదలకు వరంగా సీఎం సహాయనిధి చెక్కులు



సీఎం సహాయనిధి చెక్కులు అందజేస్తున్న దృశ్యం

**నవాబుపేట, మే16 ప్రభాతవార్త:** సిఎం సహాయనిధి పేదలకు వరం అని చాకలిపల్లి మాజి సర్పంచ్ రాములమ్మ శేఖర్ అన్నారు. సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను శుక్రవారం లబ్దిదారులకు అందజేశారు. ఈ నేపథ్యంలో చాకలిపల్లి గ్రామానికి చెందిన చెంచు మంగమ్మకి రూ. 17500ల విలువగల సీఎంఆర్ఎఫ్ చెక్కులని లబ్దిదారులకు గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు అందజేశారు. చెక్కులు తీసుకున్న లబ్దిదారులు మాట్లాడుతూ వైద్య సహాయం కొరకు సీఎంఆర్ఎఫ్ నిధులనుంచి నిధులు తమకు అందేలా కృషి చేసిన ఎమ్మెల్యే రెడ్డికి గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులకు లబ్దిదారులు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ నాయకులు గోన్యనాయక్, తిరుమల, రాములు, శేరి కేశవులు, పెద్దబావి విజయ్, గొడుగు బాలరాజ్, అనిల్, శేరీ చెన్నయ్య, బోల్ల కేశవులు, బొక్క నర్సింలు, చెంచు మాసయ్య, పాండు తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారికి మొక్కులు చెల్లించిన రావుల



అమ్మవారికి వెండి ఆభరణాలు అందిస్తున్న రావుల చంద్రశేఖర్‌రెడ్డి

**పెబ్బేరు, మే 16 ప్రభాతవార్త :** పెబ్బేరు మున్సిపల్ కేంద్రంలోని శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో నూతనంగా నిర్మించిన శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవి అమ్మవారిని దర్శించుకున్న మాజీ రాజ్యసభ సభ్యులు రావుల చంద్రశేఖర్ రెడ్డి వారి అమ్మ కీ।।శే.రావుల పద్మమ్మ జ్ఞాపకార్థంగా ఆలయానికి శఠగోపము, స్థాలీ, ఉద్ధరిని, అరివేని పాత్ర, గంట మొత్తం"50 తులాల వెండి" వస్తువులను మొక్కుబడిగా అమ్మవారికి చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు గోవర్ధనా చారి రావుల కుటుంబం పేరుపై అష్టోత్తరలతో ప్రత్యేక పూజలు చేసి మంగళహారతి, తీర్థ ప్రసాద వితరణ చేశారు. అమ్మవారి ప్రతిష్ఠ కోసం కష్టపడిన కమిటీ సభ్యులను రావుల చంద్రశేఖర్ రెడ్డి అభినందించి సత్కరించారు. అనంతరం కమిటీ సభ్యులు రావులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల టౌన్ అధ్యక్షులు వనం రాములు దిలీప్ రెడ్డి,ఆలయ ప్రధాన కార్యదర్శి వడ్డేఈశ్వర్ (గురుస్వామి),మండల నాయకులు ఆలయ కమిటీ సభ్యులు,రావుల అభిమానులు పాల్గొన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోండి

**చిన్న చింతకుంట, మే 16 ప్రభాతవార్త :** గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే డెంగ్యూ వ్యాధిని తరిమి కొట్టవొచ్చని ఆరోగ్య కేంద్రం వైద్యురాలు శిరీష అన్నారు. శుక్రవారం జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ ఆస్పత్రి నుంచి అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ ఇంటి చుట్టూ నీటి నిల్వలు ఉంచకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని ఆమె సూచించారు. తమ ఇంటి పరిసర ప్రాంతాల్లో టైర్లు, ట్యూబ్లు,చెత్తలేకుండా పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే డెంగ్యూ బారిన పడకుండా ఉంటారని ఆమె తెలిపారు.ఈ అవగాహన ర్యాలీలో ఆరోగ్య కేంద్ర సిబ్బంది,ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆలయ భూముల వేలంపాటపై సమావేశం

**అలంపూర్,మే 16 ప్రభాతవార్త:** జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి వారి ఆలయము నందు మొదటి పర్యాయము 21.04.2025 నాడు నిర్వహించిన ఆలయ భూముల కౌలు బహిరంగ వేలం నందు సరైన ధర రాక పోవడంతో వాయిదా పడిన 6 సర్వే నంబర్లకు రెండవ పర్యాయము 02.05.2025 శుక్ర వారము నాడు నిర్వహించిన కౌలు బహిరంగ వేలం నందు 6 సర్వే నంబర్లకు గాను ఇద్దరు మాత్రమే డిపాజిట్ చెల్లించి నందున కౌలు వేలం పాట పాడుటకు వీలు కానందున ఈ వేలం పాటను మూడవ పర్యాయము నిర్వహించుటకు వాయిదా వేయనైనది. వాయిదా పడిన 6 సర్వే నంబర్లకు మూడవ పర్యాయము ఈ రోజు 16.05.2025 శుక్రవారం నాడు కౌలు బహిరంగ వేలం నిర్వహించగా ఈ రోజు కూడా ఒక సర్వే నంబరు 253, కు ఇద్దరు, మరొక సర్వే నంబరు 346/1, 346/3 కు ఒకరు మాత్రమే డిపాజిట్ చెల్లించగా, వేలం పాట షరతుల ప్రకారం తప్పనిసరిగా ముగ్గురు పాల్గొన వలసి వున్నందున, వాయిదా పడిన 6 సర్వే నంబర్లకు మూడవ పర్యాయము నిర్వహించిన ఈ వేలం పాటను రద్దు చేసి, తదుపరి నివేదికను శ్రీయుత ప్రాంతీయ సంయుక్త కమీషనర్, దేవాదాయ శాఖ, హైదరాబాద్ వారికి పంపి తదుపరి వారి ఆదేశముల ప్రకారం నడుచుకోనగలము.

## ఇళ్ల ముందు నీటి నిల్వలు లేకుండా చూడాలి



ఇటిక్యాలలో జాతీయ డెంగ్యూ దినోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

**ఇటిక్యాల, మే 16 ప్రభాతవార్త:** ఇండ్ల ముందు నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని అలాగే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని నీటి నిల్వలో ఉండే ఈడిస్ ఈజిప్ట అనే దోమ వలన డెంగ్యూ వ్యాధి సోకుతుందని ఇటిక్యాల ప్రభుత్వ ఆసుపత్రి డా. రాధిక ప్రజలకు వివరించారు. శుక్రవారం జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా డా. రాధిక, హెల్త్ సూపర్ వైజర్లు సి బ్బంది ఆశా కార్యకర్తలతో కలిసి జాతీయ డెంగ్యూ వ్యాధిపై ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డా. రాధిక మాట్లాడుతూ దోమల కాటు వల్ల డెంగ్యూ వ్యాధి లక్షణాలైన రక్త కణాలు తగ్గి చర్మంపై దద్దుర్లు, వాంతులు విరోచనాలు కండ్లు గుంతలు పడటం, మొదలగు లక్షణాలు ఉంటాయని అందువల్ల ఇళ్ల ముందు దోమలు ఉత్పత్తి కాకుండా చూసుకోవాలని బయటకు వెళ్లేటప్పుడు ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని అలాగే ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలని ప్రజలను డా. రాధిక కోరారు.

## కొనుగోలు ప్రక్రియలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

- నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్



వరి ధాన్యంలో తేమ శాతాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

**అచ్చంపేట, మే16 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ శుక్రవారం అచ్చంపేట పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డుకు రైతులు తీసుకువచ్చిన వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు.అకాల వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మార్కెట్లో అధికారులు తీసుకుంటున్న జాగ్రత్తలను కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అకాల వర్షాల ప్రభావం నుంచి ధాన్యాన్ని రక్షించేందుకు రైతులు టార్పాలిన్ కప్పి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎక్కడైనా వర్షం వల్ల తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టి, పాడి క్లీనర్ ద్వారా శుభ్రపరచి కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కొనుగోలు కేంద్రాల నిర్వహణ,సిబ్బందిపనితీరు, ధాన్యం నాణ్యత, రైతుల అవసరాలు, డబ్బు చెల్లింపులు తదితర అంశాలను క్షుణ్ణంగా కలెక్టర్ పరిశీలించారు. ధాన్యాన్ని వేగవంతంగా మిల్లులకు తరలించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.హమాలీలు, లారీలను అదనంగా ఏర్పాటుచేసి ధాన్యాన్ని కొనుగోలు చేసిన వెంటనే ఎంపిక చేసిన మిల్లులకు తరలించాలని కలెక్టర్ ఆదేశించారు.వరి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు పకడ్బందీగా చర్యలు చేపట్టాలని సూచించారు. ఇప్పటివరకు రైతులతో కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు, రైతులకు డబ్బుల చెల్లింపులను కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు ప్రక్రియలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.కలెక్టర్ వెంకట్ అచ్చంపేట ఆర్డిఓ మాధవి, తహసీల్దార్ చంద్రశేఖర్, డీఎస్‌డీఓ శ్రావణ్, డీటీ హేమ్లానాయక్ శాఖల అధికారులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## వనపర్తి జిల్లా ప్రజలకు మహర్దశ

- వ్యాపారులకు తీరునున్న కష్టాలు
- త్వరలోనే అందుబాటులోకి ఇంటిగ్రేటెడ్ మార్కెట్
- వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు శ్రీనివాస్ గౌడ్



ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను పరిశీలిస్తున్న వ్యవసాయ మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్

**వనపర్తి క్రైమ్, మే16 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా కేంద్రంలో కొత్త బస్టాండ్ సమీపంలో గల పాత వ్యవసాయం మార్కెట్ యార్డ్ లో 19. 50 కోట్ల రూపాయలతో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ వచ్చే జూన్1 నాటికి షాపులు కేటాయించిన వ్యాపారస్తులకు అందుబాటులోకి తీసుకు వస్తున్నట్లు వనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. మొత్తం 81 షాపింగ్ కాంప్లెక్స్‌తో పాటు వివిధ రకాల నిత్యవసర వస్తువులు సూపర్ మార్కెట్ వంటి అవసరాల కోసం ప్రజలు వినియోగదారులు ప్రతి ఒక్కటి ఒకేచోట కొనుగోలు చేసే విధంగా ఇంటిగ్రేటెడ్ మార్కెట్అందుబాటులోకి వస్తుందని గతంలో పెంచిన షాపులకిరాయిలు, డిపాజిట్లు ఎక్కువ మొత్తంలో ఉండడంతో వ్యాపారస్తులు ముందుకు రాలేకపోయారని పెంచిన షాపు ధరలు కిరాయిలు తగ్గించాలని వనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ నుంచి తెలంగాణ రాష్ట్ర మార్కెటింగ్ శాఖ అధికారులను కోరడం జరిగిందని అందువల్లనే శుక్రవారం రాష్ట్రస్థాయి మార్కెటింగ్ శాఖ అధికారులు అడిషనల్ డైరెక్టర్ రవికుమార్ జైన్, డైరెక్టర్‌మల్లేశం, జిల్లాఅధికారి సర్వజిత్, ఇంటిగ్రేటెడ్‌ను సందర్శించి ఇక్కడ ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారని ఆయన తెలిపారు.ముఖ్యంగా షాపుల ధరలు ఎక్కువ ఉన్నాయని అందువల్లనే ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ఉపయోగంలోకి రాకుండా నిరుపయోగంగా ఉన్నందున తక్షణమే రాష్ట్ర స్థాయి మార్కెటింగ్ శాఖ అధికారులు స్పందించి జూన్ 1 నుంచి లబ్ధిదారులకు టెండర్ల ద్వారా కేటాయించిన అన్ని షాపులు అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చారని ఆయన తెలిపారు. జిల్లా కేంద్రంలో ప్రజలకు అందుబాటులో ఆర్టీసీ బస్టాండ్ కు దగ్గరలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మించడం వల్ల చేపలు, మాంసం, కూరగాయలు, నిత్యవసర సరుకులు ఒకే చోట ప్రజలకు అందుబాటులోకి రాబోతున్నాయని ఈ షాపులు కేటాయించడానికి మార్గం సుగమం అయిందని ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి మార్కెటింగ్ శాఖ అధికారులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్‌తో పాటు రాష్ట్ర స్థాయి మార్కెటింగ్ శాఖ అడిషనల్ డైరెక్టర్ రవికుమార్ జైను, డైరెక్టర్ మల్లేశం, జిల్లా అధికారి సర్వజిత్తు తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన భూ రెవెన్యూ సదస్సులు

- షాబాద్‌లో చివరి రోజు 64 దరఖాస్తులు
- 5 వ తేదీ గోపల్‌దిన్నెలో రెవెన్యూ సదస్సును ప్రారంభించిన జిల్లా కలెక్టర్ బిఎం సంతోష్



రైతుల నుండి భూ సమస్యలు తెలుసుకుంటున్న ఆర్డీవో శ్రీనివాసరావు

**ఇటిక్యాల, మే 16 ప్రభాతవార్త:** మండల పరిధిలోని షాబాద్ గ్రామంలో శుక్రవారం చివరి రోజు రెవెన్యూ సదస్సు తహసిల్దార్ వీరభద్రప్ప ఆధ్వర్యంలో నిర్వహించగా ఈ సదస్సుకు ఆర్డీవో శ్రీనివాసరావు హాజరై భూ సమస్యలు ఉన్న రైతులతో మాట్లాడి భూ రికార్డులను పరిశీలించి రైతుల నుండి దరఖాస్తులు స్వీకరించగా వివిధ భూ సమస్యల పరిష్కారం కోసం 64 దరఖాస్తులు వచ్చినట్లు తహసిల్దార్ వీరభద్రప్ప తెలిపారు.కాగా రాష్ట్ర ప్రభుత్వం ధరణి పోర్టల్ స్థానంలో కొత్తగా భూభారతి చట్టం తీసుకురాగా ఏళ్ల తరబడిగా భూ సమస్యలు ఎదుర్కొంటున్న రైతులకు భూ సమస్యలను పరిష్కరించేందుకు గాను ఏప్రిల్ 14వ తేదీ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్అంబేద్కర్ జయంతి సందర్భంగా భూభారతి చట్టం ప్రారంభించి రాష్ట్రస్థాయిలో 4 మండలాలను పైలెట్ ప్రాజెక్టు మండలాలుగా ఎంపిక చేశారు. అలాగే ఈనెల 5వ తేదీన జోగులాంబ గద్వాల జిల్లాలో ఇటిక్యాల మండలాన్ని పైలెట్ ప్రాజెక్టు మండలం గా ఎంపిక చేయగా మండలంలోని 10 రెవెన్యూ గ్రామాలలో భూ సమస్యల పరిష్కారం కోసం రైతులనుండి దరఖాస్తుల స్వీకరించేందుకుగాను రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేశారు. ఈనెల 5వ తేదీ నుండి 16వ తేదీ వరకు నిర్వహించేందుకు తేదీలు ప్రకటించగామొదటి రోజు గోపల్ దిన్నె గ్రామంలో భూ రెవెన్యూ సదస్సును ఇటిక్యాల మండల తహసిల్దార్ వీరభద్రప్ప ఆధ్వర్యంలో నిర్వహించగా ఈ సదస్సుకు జిల్లా కలెక్టర్ బి ఎం సంతోష్. జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మి నారాయణ,ఆర్డీవో శ్రీనివాసరావు హాజరై సదస్సును ప్రారంభించారు. దీంతో ప్రకటించిన తేదీల ప్రకారం గ్రామాల వారిగా 2 టీములుగా ఏర్పడి ఇటిక్యాల, ఎర్రవల్లి మండలాల తాహసిల్దారులు వీరభద్రప్ప, నరేష్, సీనియర్ అసిస్టెంట్లు ఆర్ఐ జూనియర్ అసిస్టెంట్లు, సర్వేయర్లు సిబ్బందితో కలిసి రెవెన్యూ సదస్సులు నిర్వహించగా శుక్రవారంతో ఇటిక్యాల మండలంలో రెవెన్యూ సదస్సులు ముగిశాయి. మండలంలోని 10 రెవెన్యూ గ్రామాలలో భూ రెవెన్యూ సదస్సు నిర్వహిస్తుండగా ఒకరోజు ముందుగానే చాటింపు. అలాగే గ్రామంలో గల మైక్‌సిస్టం ద్వారా ప్రజలకు సదస్సుపై సమాచారం అందించారు. దీంతో గ్రామాలలో జరిగిన బూ రెవెన్యూ సదస్సుకు రైతులు స్వయంగా వచ్చి వారి భూ సమస్యలపై అధికారులకు దరఖాస్తులు చేసుకున్నారు. మండలంలో చాగాపురం రెవిన్యూ గ్రామంలో ఎక్కువగా 127 దరఖాస్తులు వచ్చాయి. షాబాద్ లో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆర్డీవో శ్రీనివాసరావు తహసిల్దారు వీరభద్రప్ప, డిప్యూటీ తహసిల్దార్ నందిని, సీనియర్ అసిస్టెంట్ మనోహర్, ఆర్ఐలు మదన్ మోహన్. గురురాజా, సర్వేయర్ దౌళమ్మ, జూనియర్ అసిస్టెంట్లు ఈశ్వర్, ఆలీ భాష, కంప్యూటర్ ఆపరేటర్లు సాయి, మేఘన, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పదోన్నతులు మరింత బాధ్యతను పెంచుతాయి

- వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్
- ఏఎస్సై నుండి ఎస్సైలుగా పదోన్నతి పొందిన పోలీసులను అభినందించిన ఎస్పీ



పదోన్నతి పొందిన ఎస్సైలకు చిహ్నాలను అలంకరిస్తున్న ఎస్పీ రావుల గిరిధర్

**వనపర్తి క్రైమ్,మే16 ప్రభాతవార్త:** పోలీసు వ్యవస్థలో నిరంతరంగా సేవలందించి శుక్రవారం పదోన్నతి పొందుతున్న రేవల్లి పోలీస్టేషన్ ఏఎస్సై పి.మల్లయ్య, వీపనగండ్ల పోలీస్టేషన్ ఏఎస్సై ఎ.చంద్రారెడ్డి, పెద్దమందడి పోలీస్టేషన్ ఏ ఎస్సై మహ్మద్ నాయీముద్దీన్, చిన్నంబావి పోలీస్టేషన్ ఏఎస్సై, జయన్నలు ఎస్సైలుగా పదోన్నతి పొందిన పోలీసులు శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ రావుల గిరిధర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలు అందజేశారు. పదోన్నతి పోలీసులకు ఎస్పీ పదోన్నతి చిహ్నాలను అలంకరించి శుభాకాంక్షలు తెలియజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసుశాఖలో పదోన్నతులు మరింత బాధ్యతను పెంచుతాయని అన్నారు, పదోన్నతులు పొందిన పోలీస్ సిబ్బంది రెట్టింపు ఉత్సాహంతో ప్రజలకు సేవలు అందించాలని కోరారు. పోలీసు శాఖలో క్రమశిక్షణతో బాధ్యతగా విధుల పట్ల నిబద్ధతతో వ్యవహరించే ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు, మర్యాదలు లభిస్తాయని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ సీఐ, నరేష్, రిజర్వు ఇన్స్పెక్టర్, అప్పలనాయుడు, పదోన్నతి పొందిన ఎస్సైలు కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

## మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించిన జిల్లా ఎస్పీ

- మనిషి ఆరోగ్యంగా జీవించడానికి స్వచ్ఛమైన నీటిని తాగాలి : వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్



అయ్యవారిపల్లిలో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న జిల్లా ఎస్పీ రావుల గిరిధర్

**పెబ్బేరు, మే16 ప్రభాతవార్త:** పెబ్బేరు మండలం అయ్యవారిపల్లి గ్రామంలో కమ్యూనిటీ ప్యూర్ వాటర్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వాటర్ ప్లాంట్‌ను జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మనిషికి నీరు జీవనాధారమని ఆరోగ్యంగా జీవించడానికి స్వచ్ఛ మైన నీటిని తాగాలని ఈ మినరల్ వాటర్ వల్ల లవణాలలతో కూడిన నీరు లభిస్తుందని తెలిపారు. ఇది సాధారణంగా సహజ మినరల్ స్ప్రింగ్స్ నుండి వస్తుంది. ఈ నీటిలో లవణాలు,ఇతర ఖనిజాలుఉంటాయని అన్నారు. ఇవి ప్రత్యేకమైన రుచిని ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయని ఈ నీటిలో కాల్షియం,మెగ్నీషియం, పొటాషియం వంటి పోషకాలు అదనంగా ఉంటా యన్నారు. జీర్ణక్రియ మెరుగుపరుస్తూ మూత్రపిండాలు శుభ్రపరుస్తాయనీ, రక్తపోటును తగ్గిస్తుందని ఎముకలను బలోపేతం చేస్తుందని పేర్కొన్నారు.ఇది సాధారణ నీటి కంటే ఎక్కువ ప్రయో జనాలు ఉన్నందువలన ప్రజలు ఈ అవకాశాన్ని సద్వి నియోగం చేసుకోవాలని ఎస్పీ కోరారు. ఈ కార్యక్రమంలో వనపర్తి ఎక్సైజ్ సీఐ, వెంకట్‌రెడ్డి, కమ్యూనిటీ ప్యూర్ వాటర్ సంస్థమేనేజర్,రమేష్,సంస్థ ప్రతినిధులు శ్రీనివాసరావు, ముజీబ్, గ్రామపెద్దలు,దేవాలయం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## పేరూరులో డెంగ్యూ వ్యాధి పై ర్యాలీ



డెంగ్యూ వ్యాధిపై ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

**దేవరకద్ర, మే16 ప్రభాతవార్త:** జాతీయ డెంగ్యూ దినోత్సవం జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పేరూరులో డా.రాధిక వైద్యాధికారి ఆధ్వర్యంలో, పేరూరు గ్రామ పురవీధుల్లో శుక్రవారం నాడు డెంగ్యూ నివారణ నినాదాలు చేస్తూ, గ్రామ ప్రజలకు డెంగ్యూ నివారణ చర్యల గురించి తెలుపుతూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పేరూరు పరిధిలోని అన్ని గ్రామాలకు సంబంధించిన ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు. సిబ్బంది రాజన్న, ఎంపిహెచ్ఈఓ నరహరి తదితరులు పాల్గొన్నారు.

## నేడు దేవరకద్రలో కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమావేశం

**దేవరకద్ర,మే16 ప్రభాతవార్త:** దేవరకద్ర నియోజకవర్గం కేంద్రంలో నేడు శనివారం నాడు 11 గం.లకు శ్రీనివాస ఫంక్షన్ హాల్ లో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర మేదర సంఘం ప్రధాన కార్యదర్శి కోన రాజశేఖర్ శుక్రవారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణం రాబోయే స్థానిక ఎన్నికలు తదితర అంశాలపై నిర్వహిస్తారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి, టిపిసిసి ఆర్గనైజింగ్ సెక్రెటరీ అరవింద్ కుమార్‌రెడ్డి, సాంబయ్య, భాస్కర్ యాదవ్ హాజరవుతున్నట్లు ఈ సమావేశానికి కాంగ్రెస్ గ్రామ అధ్యక్షులు పార్టీనాయకులు, మార్కెట్ యార్డ్ చైర్మన్లు, ప్రజా ప్రతినిధులు హాజరుకావాలని ఆయన కోరారు.

## జన్మదిన వేడుకలో మాజీ ఎమ్మెల్యే



ఆల సుదర్శన్‌రెడ్డి మనుమరాలు ఐనిక జన్మదిన వేడుకలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

**భూత్పూర్,మే 16,ప్రభాతవార్త:** భూత్పూర్ మండలం అన్నాసాగర్ గ్రామానికి చెందిన ఆల సుదర్శన్‌రెడ్డి మనుమరాలు ఐనిక జన్మదిన వేడుకలు అన్నాసాగర్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు.ఈ వేడుకలకు మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి దంపతులు ముఖ్యఅతిథులుగా చిన్నారిని ఆశీర్వదించి వారి తల్లితండ్రులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆల మాతృమూర్తి ఆల వరలక్ష్మమ్మ,ఆల సతీమణి ఆల మంజుల తదితరులు పాల్గొన్నారు.

**సంతాపం :** అన్నాసాగర్ గ్రామానికి చెందిన కుర్వ అంజనేయులు అనారోగ్యంతోశుక్రవారం తెల్లవారు జామునమృతి చెందగా, విషయం తెల్సుకున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి మృతుని ఇంటికి వెళ్లి కుర్వఅంజనేయులు మృతదేహం వద్ద శ్రద్ధాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించాలి.శ్రద్ధాంజలి ఘటించినవారిలో ఆల సోదరుడు ఆలశ్రీకాంత్‌రెడ్డి,బీఆర్ఎస్ నాయకుడు షాకీర్ ఉన్నారు.

## గ్రామ కార్యదర్శికి వినతి

**ధన్వాడ, మే 16 ప్రభాతవార్త :** లక్ష్మివాడ ప్రజలు వినతి మండల కేంద్రమైన ధన్వాడలోని లక్ష్మివాడలో మురుగు కాల్వల నిర్మాణం అస్తవ్యస్తంగా ఉండింది. లక్ష్మివాడలో అండర్ గ్రౌండ్ పైప్‌లైన్ నిర్మాణ పనులు చేపట్టి మురుగునుంచి కాపాడాలంటూ ఆ వీధి ప్రజలు అంజన్నను కోరడంతో ఆ వీధిలో అండర్ గ్రౌండ్ పైప్ లైన్ నిర్మాణ పనులు పూర్తి చేశారు. కానీ నేటికీ బిల్లులు రాలేదు అధికారులు స్పందించి అంజన్నకు బిల్లులు మంజూరు చేయాలని కోరుతూ శుక్రవారం గ్రామ కార్యదర్శి శ్రీనివాసరావుకు వినతి పత్రం అందించారు. మాజీ వార్డు సభ్యులు కేంచే భాస్కర్, ఇర్ఫాన్, అహమ్మద్, కెంచే శ్రీనాథ్‌తో పాటు పలువురు మైనారిటీ యువకులు పాల్గొని వినతి పత్రం అందించారు.

## విగ్రహాల ఏర్పాటుకు ముందుకు వచ్చిన భీష్మరాజ్ ఫౌండేషన్

**కోయిలకొండ, మే 16 ప్రభాతవార్త:** మండలంలోని ఎల్లారెడ్డి పల్లి గ్రామస్తులు శుక్రవారం హైదరాబాదులో భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ కె.రాజ్ కుమార్ రెడ్డిని కలసి పోచమ్మ దేవాలయంలో దేవతామూర్తుల విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు విగ్రహాలను ఇప్పించాలని గ్రామస్తులు కోరారు. అందుకు భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ కె. రాజ్‌కుమార్ రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ విగ్రహాల ఏర్పాటుకు కృషి చేస్తాననిహామీ ఇవ్వడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. వచ్చేనెల ఒకటి1,2 తేదీలలో నిర్వహించే విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమానికి రావాలని ఫౌండేషన్ చైర్మన్ రాజ్ కుమార్‌రెడ్డి ని ఆహ్వానించారు. భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ రాజ్ కుమార్ రెడ్డిని కలిసిన వారిలో డా. హన్మిరెడ్డి, లక్ష్మణ్‌రెడ్డి, శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

## బొడ్రాయి పండుగకు విరాళం అందజేత



**రాజాపూర్, మే 16 ప్రభాతవార్త:** యూత్ కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి నారాయణ నాయక్ తన ఉదారతను చాటుకున్నారు. శుక్రవారం రాజాపూర్ మండలం గుండ్ల పొట్లపల్లి గ్రామంలో బొడ్రాయి పండుగ కోసం పలువురు గ్రామస్తులు విరాళం కోసం నారాయణ నాయక్‌ను సంప్రదించగా తాను మంచి మనసుతో బొడ్రాయి పండుగ వేడుకల కోసం రూ.51,000 వేల విరాళంగా మాజీ ఎంపీటీసీ సభ్యులు సునీత శ్రీనివాస్ నాయక్ సమక్షంలో అందజేసినట్లు నారాయణ నాయక్ తెలిపారు. విరాళం అందజేసి ఉదారత చాటుకున్న నారాయణ నాయక్‌ను గుండ్ల పొట్లపల్లి గ్రామస్తులు, పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు నారాయణ నాయక్‌నుప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గుండ్ల పొట్లపల్లి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## బాధితునికి బిఆర్ఎస్ నేత పరామర్శ

**మానవపాడు, మే 16 ప్రభాతవార్త :** అయిజ పట్టణానికి చెందిన బిఆర్ఎస్ నాయకుడు అంజిబాబు బుధవారం రాత్రి గుండెపోటుకు గురయ్యాడు. దీంతో చికిత్స నిమిత్తం అతన్ని కుటుంబ సభ్యులు కర్నూల్‌లోని ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ యువనేత కిషోర్ శుక్రవారం హాస్పిటల్‌కు వెళ్ళి బాధితున్ని పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితులపై బాధితుని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని వైద్యులకు సూచించారు.

## స్ట్రాంగ్ రూమ్ వద్ద పటిష్ట భద్రత



ఈవిఎంలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ సంతోష్

**గద్వాల, మే 16,ప్రభాతవార్త:** ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ వద్ద భద్రత పటిష్టంగా ఉండాలని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ అన్నారు.జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో గల గోదాములో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఈవీఎం) లను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ ను జిల్లా కలెక్టర్ సంతోష్ శుక్రవారం సంబంధిత అధికారులు,వివిధ రాజకీయ పార్టీల ప్రతి నిధులతో కలిసి తనిఖీ చేశారు.ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి నెలకు ఒకసారి నిర్వహించే సాధారణ తనఖిలో భాగంగా కలెక్టర్ ఈ తనిఖీ నిర్వహించారు. గద్వాల జిల్లాకు సంబంధించిన ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ తో పాటు భద్రత నిర్వహణను పరిశీలించారు.ఈ సందర్భంగా స్ట్రాంగ్ రూమ్ నిర్వహణకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు.స్ట్రాంగ్ రూమ్ భద్రతలో భాగంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పనితీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గద్వాల తహసిల్దార్ మల్లికార్జున్,ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ కరుణాకర్,సురేష్ వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## పిల్లలమర్రిని సందర్శించిన మిస్ వరల్డ్ కంటెస్టెంట్లు

### పాల్గొన్న మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు



**మహబూబ్‌నగర్ బ్యూరో, మే 16 ప్రభాతవార్త :** 7 శతాబ్దాలకు పైగా చరిత్ర ఉన్న పిల్లలమర్రిలో మిస్ వరల్డ్ కంటెస్టెంట్లు సందడి చేశారు.హైదరాబాదులో నిర్వహిస్తున్న ప్రపంచ సుందరి పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన ఓ బృందం శుక్రవారం పిల్లలమర్రిని సందర్శించారు. హైదరాబాద్ నుంచి ప్రత్యేక బస్సులో బయలుదేరి సాయంత్రం 5 గం.లకు మహబూబ్ నగర్‌కు చేరుకున్నారు. తెలంగాణ పండుగల విశిష్టత సంస్కృతిని ప్రతిబింబించేలా సాంప్రదాయ నృత్యాల మధ్య సుందరీమణుల బృందానికి స్వాగతం పలికారు. మొదట శ్రీ రాజరాజేశ్వరి సమేత రామలింగేశ్వర స్వామిని దర్శించుకున్నారు. అనంతరం మ్యూజియాన్ని సందర్శించారు. కాసేపు ఉత్సాహంగా బతుకమ్మ ఆడారు. గిరిజన యువతుల బంజారా నృత్యం చేయగా, మిస్ వరల్డ్ కంటెస్టెంట్లు వారితో జత కలిశారు.తర్వాత పిల్లలమర్రి మహావృక్షాన్ని వీక్షించారు.చెట్టు యొక్క చరిత్ర, మహావృక్షం పునరుజ్జీవనం గురించి అటవీశాఖ అధికారి వారికి వివరించారు. నారాయణపేట, గద్వాల చేనేత వస్త్రాలు, హస్తకళలు, కళాకృతులు స్టాల్స్‌ను సందర్శించారు.అనంతరం మర్రి చెట్టు వద్ద గ్రూప్ ఫోటో దిగారు.అనంతరం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు యెన్నంశ్రీనివాస్‌రెడ్డి, బండ్లకృష్ణ మోహన్ రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, మధుసూదన్ రెడ్డి,వాకిటి శ్రీహరి, పర్ణికరెడ్డి, వీర్లపల్లి శంకర్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## జాతీయ డెంగ్యూ నివారణ ర్యాలీని ప్రారంభించిన కలెక్టర్



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

**నారాయణపేట టౌన్, మే 16 ప్రభాతవార్త:** జాతీయ డెంగు నివారణ దినం సందర్భంగా నారాయణపేట జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ప్రారంభించారు. ఈ ర్యాలిని నినాదాలతో సావర్కర్ చౌరస్తాకు చేరుకొని డా. జయచంద్ర మోహన్ డిఎం హెచ్‌ఓ, డా. ఎన్.శైలజ డివైడిఎం హెచ్‌ఓ మాట్లాడుతూ డెంగ్యూ వ్యాధి పట్లనివారణ చర్యలు తీసుకునేజాగ్రత్తలు, పరిసరాలశుభ్రత గురించి అవగాహన కల్పించడం జరిగింది. డెంగ్యూ వ్యాధి యొక్క లక్షణాలను మరియు చికిత్సా విధానాన్ని తెలియజేశారు. డెంగ్యూ వ్యాధి ఏడిస్ దోమ కాటు వల్ల వ్యాప్తి చెందుతుందని, ప్రతి ఒక్కరు దోమల నివారణ చర్యలు చేపట్టాలని, ప్రతి ఒక్కరు దోమ తెరలు తప్పని సరిగా వాడాలని తెలిపారు. అనంతరం డెంగ్యూ ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. ఈ కార్యక్రమములో డాక్టర్ నర్సింహా రావు, డా. గగన్, గోవిందరాజు ఎంపిహెచ్ఈవో, విజయ్‌కుమార్ ఎంపిహెచ్ఈఓ జానకమ్మ, పీహెచ్‌ఎన్ , శ్రీనివాస్, గోవిందరావు,శంకర్, చంద్రశేఖర్, బుగ్గేశ్వర్, బాలశేఖర్, సూపర్ వైజర్, తబిత రాణి, శివశేషమ్మ, సరస్వతి, రామేశ్వరీ, పుష్ప, పుష్పలత, కరుణ, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అందాల పోటీలపై ఉన్న శ్రద్ధ ప్రజల సమస్యలపై లేని కాంగ్రెస్ ప్రభుత్వం

### బిజెపి జిల్లా లీగల్ సెల్ కన్వీనర్ నందు నామాజీ

**నారాయణపేట టౌన్, మే 16 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వానికి అందాల పోటీలపై ఉన్న శ్రద్ధ ప్రజా సమస్యలపై లేదని నారాయణపేట జిల్లా లీగల్ సెల్ కన్వీనర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందు నామాజీ ఒక ప్రకటనలో విమర్శించారు. ప్రస్తుతం రైతులు,విద్యార్థులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆందోళనవ్యక్తం చేశారు.వర్షాలు కురుస్తుండడంతో ధాన్యం కొనుగోలు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుండటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. అలాగే గత కొన్నేళ్లుగాఫీజు రీయింబర్స్మెంట్ పథకాన్నిఅమలుచేయకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారనీ మండిపడ్డారు.ఫీజు రీయింబర్స్మెంట్ రాకకళాశాల యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వక పోవడంతో ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోలేక జీవితాలను విద్యార్థులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఒకపక్క రైతులు మరోపక్క విద్యార్థులు అల్లాడుతుంటే ప్రభు త్వం మాత్రం అందాల పోటీలపై ఆరాటం చూపుతున్నదని మండిపడ్డారు. అందాల పోటీలకు బిజెపి వ్యతిరేకం కాదనికానీ ఆ పోటీలతో పాటు రైతులను, విద్యార్థులను ఆదు కోవాల్సిన బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే వారే ఈ ప్రభుత్వానికి బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

# స్థానిక ఎన్నికల్లో గెలిచేది బిఆర్ఎస్ పార్టీనే

- అభివృద్ధి కోసం వచ్చాయన్న రూ.1000 కోట్లు ఎక్కడ?
- గత ప్రభుత్వం జర్నలిస్టులకు ఇచ్చిన ప్లాట్లను లాక్కున్నారు
- బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, మాజీ మార్కెట్ చైర్మన్ లక్ష్మారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న గట్టు యాదవ్

**వనపర్తి ప్రతినిధి, మే16 ప్రభాతవార్త:** అసెంబ్లీ ఎన్నికల్లో మోస పూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారని, రాబోయే స్థానిక ఎన్నికలలో గెలిచేది బిఆర్ఎస్ పార్టీనే అని బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్ అన్నారు. శుక్రవారం మాజీ మంత్రి నివాసంలో ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్, మాజీ మార్కెట్ చైర్మన్ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఎన్నికల లో భాగంగా మీరు ఇచ్చిన హామీలు ఏమయ్యాయో ప్రజలకు చెప్పాలని, రూ.1000 కోట్ల అభివృద్ధి పనులు అంటూ ఊరించడమే పనిగా పెట్టుకుని ప్రజలను ఏమార్చినట్లు ప్రతిపక్షాలను ఏమార్చాలని చూస్తే ఊరుకోమని హెచ్చరించారు. నిన్ను ఎమ్మెల్యేగా గెలిపించుకున్నందుకు ఏం జరుగుతుందో ప్రజలు గమనిస్తున్నారని ఏడాదిన్నర కాలంలోనే మీ పాలన బట్టబయలు అయిందని దుయ్యబట్టారు. వనపర్తి పట్టణంలో దశాబ్దాల కల రోడ్ల విస్తరణ మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి సాధిస్తే మిగిలిపోయిన 10 శాతం పనులు కూడా పూర్తి చేయలేకపోవడం మీ అసమర్థతకు నిదర్శనమని అన్నారు. మేఘన్న సేన పేరిట రాత్రి పగలు మీ గెలుపు కోసం పనిచేసిన యువత నేడు అసంతృప్తితో రగిలిపోతున్న విషయం నీకు తెలియదా అని ప్రశ్నించారు. ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అమలు చేయాలని ప్రజల డిమాండ్ చేస్తుంటే ముఖం చాటేస్తున్నారని అన్నారు. చివరకు జర్నలిస్టులకు ఇచ్చిన ప్లాట్లను సైతంలాక్కున్న ఘనత మీకే చెందుతుందని ఘాటుగా విమర్శించారు. ఈ సమావేశంలో స్టార్ రహీం, జోహెబ్ హుస్సేన్, సునీల్ వాల్మీకి, చిట్యాల రాము, నందిమల్ల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## గొలుసుకట్టు వ్యాపారాల జోలికి వెళ్ళవద్దు

### మల్టీ లెవెల్ మార్కెటింగ్ స్కీములతో ప్రజలు అప్రమత్తంగా వుండాలి : నారాయణపేట జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్





ఎస్పీ యోగేష్ గౌతమ్

**నారాయణపేట టౌన్, మే16 ప్రభాతవార్త:** ప్రజల సొమ్ము దోచుకోనేందుకు సైబర్ నేరగాళ్ళు రోజు,రోజుకి కొత్త కొత్త పోకడలతో ప్రజల బలహీనతలను పెట్టుబడిగా చేసుకోనేందుకు సైబర్ నేరగాళ్ల కొత్త పంథాలను ప్రయోగిస్తున్నారు.మోసపూరిత వాగ్దానాలు, ప్రకటనలతో మోసాలకు పాల్పడుతున్న మల్టీ లెవెల్ మార్కెటింగ్ స్కీముల పట్ల ప్రజలు అప్రమత్తంగా వుండాలని జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ప్రజలకు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గొలుసుకట్టు వ్యాపారాలు చేస్తూ ప్రజలను మోసం చేసే మల్టిలెవెల్ వ్యాపారాలు పెరుగుతున్నాయి అని నిత్యవసర సరుకులు, గృహోపకరణాలు, వ్యవసాయ అనుబంధ ఉత్పత్తులు, క్రిప్టో కరెన్సీ మొదలగు వాటి పేర్లు చెప్పి ప్రజలను ఆర్థిక మోసాలకు గురిచేసే మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయి. మీ క్రింద ఎక్కువ మంది ఏజెంట్లను చేర్పించి తక్కువ కాలంలో ఎక్కువ లాభాలు పొందండి అనే వాటిని నమ్మవద్దని ఎస్పీ అన్నారు. ఇలాంటి మల్టీలెవల్ వ్యాపారం చేస్తూ ప్రజల నుండి డబ్బులు సేకరించి ఆర్థికంగా మోసం చేస్తూ చైన్ సిస్టం మార్కెటింగ్ వ్యాపారాల ద్వారా ఆర్థికపరమైన మోసాలు జరుగుతున్నాయని ప్రజలుగుర్తించాలని కోరారు. ఎక్కువ మంది ఏజెంట్లను చేర్పిస్తే రివార్డులు, పాయింట్లు లభిస్తాయని కేటుగాళ్లు ఆశ చూపుతారు. ఇలాంటి వారి మాయ మాటలు నమ్మి అత్యాశకు పోతే భారీగా ఆర్థిక నష్టం జరుగు తుందని అన్నారు. సైబర్ మోసగాళ్ళు కొత్త పద్ధతుల్లో మోసాలకు పాల్పడుతున్నారు. సైబర్ మోసాల పట్ల ప్రజల్లో అవగాహన పెరగడంతో సైబర్ మోసగాళ్లు మల్టీలెవెల్ మార్కెటింగ్ పై దృష్టి సారించి గొలుసుకట్టు వ్యాపారాల పేరుతో వాట్సప్, టెలిగ్రామ్, ఫేస్‌బుక్ లాంటి సోషల్ మీడియా వేదికల ద్వారా ప్రకటనలు చేసి అమాయకులను ఆకర్షించి మోసగించి ఆర్థిక నష్టాన్ని కలగజేస్తారన్నారు. మల్టీ లెవెల్ మార్కెటింగ్‌ను చాలామంది విదేశాల్లో ఉండి ఒక రాకెట్ లానడుపుతారు. భారీ లాభాలు తోపాటు లగ్జరీ కార్లు,ఫారిన్ టూర్ల పేరిట తమ ముఠాలతో అమాయకులకు వలపన్నుతారని ఎలాంటి మాయ మాటలు నమ్మరాదని ఎస్పీ తెలిపారు.అతి తక్కువకాలంలో అధిక లాభాలు వస్తాయని ఎవరైనా చెప్తే అది మోసమని గ్రహించాలి, లేదంటే ప్రజల్ని మాయలోకి దింపి డబ్బులు కొల్లగొడతారు, అత్యాశకు పోతే మోసపోవడం ఖాయమని వివరించారు. గొలుసుకట్టు మార్కెటింగ్‌లో ముందుగా చేరిన వారికి లాభాలు వస్తాయి ఆ తర్వాత చేరిన వారంతా తీవ్రంగా నష్టపోవాల్సి ందే.ఇలాంటి నెట్వర్క్ లో ఎవరు చేరొద్దు ఆయా సంస్థల నిర్వాహకులు, కంపెనీలు పెట్టే సభలు, సమావేశాలకు ఎవరు వెళ్ళవద్దని, సోషల్ మీడియాలో వచ్చే అబద్ధపు ప్రకటన పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని అనుమానాస్పద ప్రకటనలు, వెబ్ లింకులు, ఏపీకె ఫైల్స్ లాంటివి డౌన్‌లోడ్ చేయవద్దని, మోసపూరిత ప్రకటనలపై, ఆర్థిక మోసాలపై వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 193 కు ఫిర్యాదు చేయండి అని ఎస్పీ తెలిపారు.

## పేట నుండి హజ్ యాత్ర



హజ్‌యాత్రకు వెళ్తున్న వారిని సన్మానిస్తున్న దృశ్యం

**నారాయణపేట టౌన్, మే 16 ప్రభాతవార్త:** నారాయణపేట మున్సిపాలిటీలోని హజ్ యాత్రికుల తొలి బృందం మొత్తం 11మంది యాత్రికులతో కూడి, తల్బియా మంత్రోచ్చారణల మధ్య స్థానిక తకీ బాబా దర్గా ప్రాంగణం నుండి హైదరాబాద్‌కు బయలుదేరింది. ఈ తొలి బృందానికి నారాయణపేట జిల్లా అడిషనల్ ఎస్పీ రియాజ్ ఉల్ హక్, నారాయణపేట మాజీ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కుంభం శివకుమార్ రెడ్డి, మైనారిటీ వెల్ఫేర్ ఆఫీసర్ ఎం.ఏ. రషీద్ జెండా ఊపి ఘనంగా పిలిషించారు. తదుపరి తకీ బాబా దర్గాలో హజ్ యాత్రికుల గౌరవార్థంగా అభినందన సభ జరిగింది. ఈ సభలో దర్గా సజ్జాదానశీన్ హజ్రత్ సయ్యద్ షా గియాస్‌ఊద్దీన్ కాద్రీ హజ్ యాత్రికులు నారాయణపేట హజ్ సొసైటీ సభ్యులను శాలువాలు కప్పి, పూలమాలతో సత్కరించారు. అనంతరం, కాంగ్రెస్ పార్టీ తరపున కుంభం శివకుమార్ రెడ్డి కూడా హజ్ యాత్రికులను అభినందించారు.ఈ సందర్భంగా మోలానా షఫాత్ అలీ నిజామీ, మౌలానా ఫారూక్ బిన్, మఖాషిన్ నిజామీ హజ్ యాత్ర విశేషాలు, ఆచారాలు గురించి వివరణ ఇచ్చారు.అదనపు ఎస్పీరియాజ్ ఉల్ హక్, శివకుమార్ రెడ్డి మాట్లాడుతూ, హజ్ యాత్రికులు మక్కా మదీనాలలో నారాయణపేట ప్రాంత శాంతి, అభివృద్ధి కోసం ప్రత్యేకంగా ప్రార్థనలు చేయాలని కోరారు. మైనారిటీ వెల్ఫేర్ ఆఫీసర్ ఎం.ఏ. రషీద్ నారాయణపేట యాత్రికులకు శుభాకాంక్షలు తెలియజేసి, తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, నారాయణపేట అభివృద్ధి చెందాలని కోరారు. ఈ కార్యక్రమంలో డా.మౌలానా సయ్యద్ అహ్మద్ హుసైనీ అశ్రఫీ జలాలి బారగాహ్ ఖుతాలియా కోలంపల్లి హాఫిజ్ సయ్యద్ ముస్తఫా కాద్రీ తకీ బాబా దర్గా మొహసిన్ బాబా నాత్ శరీఫ్ పఠించారు.ఈ కార్యక్రమంలో మహ్మద్ నవాజ్ మూసా, అమీరుద్దీన్ అడ్వొకేట్ హజ్ సొసైటీ అధ్యక్షుడు, అబ్దుల్ సలీం అడ్వొకేట్, మహ్మద్ రఫీక్ చాంద్, ముజాహిద్ సిద్దీకి, మహ్మద్ ఇజాజ్ హుసేన్, తాజుద్దీన్ టంగ్లీ, మహ్మద్ రియాజ్ రంగ్‌రేజ్, సర్ఫరాజ్ హుసేన్, మహ్మద్ సలీం,జాకిర్ హజారీ, మహ్మూద్ ఖురేషీ, మహ్మద్ తక్కీ మొయజ్జిన్, డా. యూసఫ్ తాజ్,ఆర్టీవో బోర్డు సభ్యుడు రాజేశ్, సతీష్ గౌడ్ అడ్వకేట్, సుధాకర్‌తో బాటు తదితరులు ఉన్నారు.

## బిజెపి నాయకుడి ఇంటిపై దాడి

- తృటిలో తప్పిన ప్రాణాపాయం
- అర్ధరాత్రి పెట్రోల్ పోసి హత్యాయత్నం
- ఖండించిన బిజెపి నాయకులు



సంఘటన స్థలంలో వివరాలు సేకరిస్తున్న ఎస్పై

**చిన్నంబావి, మే16 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా చిన్నంబావి మండలం అయ్యవారిపల్లి గ్రామంలో బిజెపి నాయకుడు చెన్నయ్య యాదవ్ పూరిగుడిసెపై పెట్రోల్ పోసి దహనం చేసిన సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. గురువారం రాత్రి 12.30 నిమిషాల సమయంలో చెన్నయ్య యాదవ్ నిద్రిస్తున్న గుడిసెపై పెట్రోల్ పోసి నిప్పంటించిన సంఘటనపై శుక్రవారం వనపర్తి జిల్లా క్లూస్ టీం పోలీసులు వివరాలు సేకరించారు. గుర్తు తెలియని వ్యక్తులు దాడికి పాల్పడ్డారని ఈ సంఘటనపై దర్యాప్తు చేపట్టి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బిజెపి రాష్ట్ర నాయకులు చిన్న మల్లయ్య, మండలాధ్యక్షులు జగ్గారెడ్డి శ్రీధర్ రెడ్డి, ఉపాధ్యక్షులు మద్దిలేటి, నాయకులు బొగ్గు కురుమయ్య డిమాండ్ చేశారు. చిన్నంబాయి మండల ఎస్సై జగన్మోహన్ కాలిన గుడిసెను చూసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సంఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



చెన్నయ్య యాదవ్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న బిజెపి నాయకులు

## క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

### క్రీడాకారులతో కాసేపు క్రికెట్ ఆడిన మాజీ మంత్రి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్

**మహబూబ్‌నగర్ బ్యూరో, మే16 ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్ లో జాంద్ర యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన జాంద్ర ప్రీమియర్ లీగ్ 3 (ఐపిఎల్ 3) క్రికెట్ టోర్నమెంట్ లో మాజీ మంత్రివర్యులు వి. శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు. క్రికెట్ పోటీలను ప్రారంభించి కొద్ది సమయం క్రీడాకారులతో కలిసి క్రికెట్ ఆడారు. తన హయాంలో క్రీడలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చినట్టు చెప్పారు. జిల్లా కేంద్రంలోని ప్రధాన క్రీడా మైదానం అభివృద్ధితో పాటు తెలంగాణలోనే మొట్ట మొదటి సరిగాపన్నెండు కోట్లతో ఇండోర్ స్టేడియం నిర్మాణం చేయడం జరిగిందని అన్నారు. గ్రామాల్లో క్రీడా మైదానాలు అభివృద్ధి చేసి అవసరం ఐన వసతులు కల్పించడం జరిగిందని చెప్పారు. చదువుతో పాటు క్రీడలపై దృష్టి సారించాలని యూవతను కోరారు. క్రీడామైదానాలకు దూరం కావడంతోనే చిన్న వయసులో అనారోగ్య సమస్యల బారినపడుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు శివరాజ్, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, నవకాంత్, నరేందర్, వేదావత్, ఇమ్రాన్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

**అలంపూర్ మే16 ప్రభాతవార్త:** ఈరోజు తెల్లవారుజామున నాలుగు గంటలకు ఈ తాండ్రపాడు గ్రామానికి చెందిన తెలుగు అనిల్ అనే వ్యక్తి ఎటువంటి పర్మిషన్ లేకుండా ఇసుకను ట్రాక్టర్ లో తరలిస్తుండగా పోలీస్ వారు పట్టుకుని కేసు నమోదు చేయనైనది సింగవరం గ్రామానికి చెందిన సునీల్ అనే వ్యక్తి కూడా ఎటువంటి పర్మిషన్ లేకుండా తుంగభద్ర నదిలో నుండి ఇసుకను ట్రాక్టర్లో నిప్పుకొని పోతుండగా పోలీసు వారు పట్టుకుని కేసు నమోదు చేయడమైనది.

## నల్ల బెల్లం అమ్మిన వారిపై కేసులు నమోదు



నల్ల బెల్లం పట్టుకున్న ఎక్సైజ్ సిబ్బంది

**పెబ్బేరు, మే 16 ప్రభాతవార్త:** పెబ్బేరు మండల పరిధిలోని రంగాపూర్ గ్రామంలో రూట్ బిట్ నిర్వహించి 2కేసులను గుర్తించి 1 ఆటో,1మహేంద్ర బొలెరో మాక్సిపిక్‌తో పాటు 4250 కిలోల నల్ల బెల్లం, 20 కిలోల పటిక, 4 లీటర్ల ఐడి లిక్కర్‌ను స్వాధీనం చేసుకున్నారు.కర్నూలు నుండి పెబ్బేర్‌కు బెల్లం రవాణా చేస్తుండగా ఎ1 కురువ మోహన్ కుమార్‌ను పట్టుకున్నారు. అతని వద్ద నుండి 25 సంచుల బెల్లం సుమారు 30 కిలోలు అంటే 750 కిలోలు,2 లీటర్ల ఐడి లిక్కర్,10 కిలోల పటికతో పాటు 1 బజాజ్ మాక్సిమా ఆటో బ్ర. నెం. ఎపి39టివై0198 మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఎ1 తాను ఈ వ్యాపారం చేస్తున్నానని ఎ2 దేవరశెట్టి కిరణ్ వెల్లడించారు. సిడిఆర్ నంబర్లు 46/2025, 47/2025, 48/2025, 49/2025లలో కేసులను నమోదు చేసారు.బిఎన్ఎస్ఎస్ యొక్క యు/ఎస్ 35(3) నోటీసు జారీ చేయడం ద్వారా నిందితులను పట్టుకుని రిమాండుకు పంపించారు. ఈ దాడులు నిర్వహించిన దానిలో కొత్తకోట ఎక్సైజ్ సీఐ కరుణ, ఎస్సై పృథ్వీరాజ్, కానిస్టేబుల్‌లో నాగరాణి, తిరుమలేష్, జనార్ధన్, వినోద్ తదితరులు ఉన్నారు.

## మొక్కజొన్న ఉత్పత్తిపై అవగాహన సదస్సు



**చిన్నంబావి, మే 16 ప్రభాతవార్త :** మొక్కజొన్న, చెరుకు పంటల సాగు, ఉత్పత్తి పై పరిశోధన కేంద్రం హైదరాబాద్, కొత్తకోటలోని ఎన్ఎస్ఎల్ చెరకు, ఇథనాల్ పరిశ్రమల ప్రాజెక్టు వారి సహకారంతో కంపెనీ పరీవాహక ప్రాంతాలలో మొక్కజొన్న ఉత్పత్తిని పెంచడం గురించి మండల పరిధిలోని కొప్పునూరు గ్రామంలోమొక్కజొన్న,చెరుకు పంటలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హైదరాబాదు నుంచి విచ్చేసిన శాస్త్రవేత్తలచే మొక్కజొన్న, చెరకు పంటల విత్తనం మరియు ఎరువుల పద్ధతుల గురించి క్షేత్ర స్థాయిలో వివరించబడింది.ఈ కార్యక్రమంలో రైతులు సహాయ వ్యవసాయ సంచాలకులు పాన్ గల్(రే) చంద్రశేఖర్, వ్యవసాయ విస్తరణ అధికారులు ఎండి సుభహన్‌పాషా, డి.సాయి రెడ్డి, శాస్త్రవేత్తలు తదితరు పాల్గొన్నారు.

## లోకాయపల్లి లక్ష్మమ్మను దర్శించుకున్న భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్

**నారాయణపేట టౌన్, మే16 ప్రభాతవార్త:** నారాయణపేట మండలం ఎక్లాస్‌పూర్ గ్రామం శ్రీశ్రీశ్రీ లోకాయపల్లి లక్ష్మమ్మ అమ్మవారిని శుక్రవారం భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ కె. రాజ్‌కుమార్‌రెడ్డి అమ్మవారి సన్నిధికి చేరుకొనిప్రత్యేక పూజలునిర్వహించి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు రాజ్ కుమార్ రెడ్డిని సన్మానించారు. ఆయన వెంట భీష్మ రాజ్ ఫౌండేషన్ సభ్యులతో పాటు తదితరులు ఉన్నారు.





## పిల్లలమర్రి రమణీయతకు మంత్రముగ్ధులు

(మొదటి పేజీ తరువాయి)

ఆస్వాదిస్తూ తెలంగాణ జరూర్ ఆనా అంటూ నినదించి మన ప్రాముఖ్యతను చాటి చెప్పారు.పిల్లలమర్రిని సందర్శించిన మిస్ వరల్డ్ కంటెస్టెంట్లు పాల్గొన్న మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు7 శతాబ్దాలకు పైగా చరిత్ర ఉన్న పిల్లలమర్రిలో మిస్ వరల్డ్ కంటెస్టెంట్లు సందడి చేశారు. హైదరాబాదులో నిర్వహిస్తున్న ప్రపంచ సుందరి పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన ఓ బృందం శుక్రవారం పిల్లలమర్రిని సందర్శించారు. హైదరాబాద్ నుంచి ప్రత్యేక బస్సులో బయలుదేరి సాయంత్రం 5 గం.లకు మహబూబ్‌నగర్‌కు చేరుకున్నారు. తెలంగాణ పండుగల విశిష్టత సంస్కృతిని ప్రతిబింబించేలా సాంప్రదాయ నృత్యాల మధ్య సుందరీమణుల బృందానికి స్వాగతం పలికారు. మొదట శ్రీరాజరాజేశ్వరి సమేత రామలింగేశ్వర స్వామిని దర్శించుకున్నారు. అనంతరం మ్యూజియాన్ని సందర్శించారు. కాసేపు ఉత్సాహంగా బతుకమ్మ ఆడారు. గిరిజన యువతుల బంజారా నృత్యం చేయగా, మిస్ వరల్డ్ కంటెస్టెంట్లు వారితో జత కలిశారు. తర్వాత పిల్లలమర్రి మహావృక్షాన్ని వీక్షించారు. చెట్టు యొక్క చరిత్ర, మహావృక్షం పునరుజ్జీవనం గురించి అటవీశాఖ అధికారి వారికి వివరించారు. నారాయణపేట, గద్వాల చేనేతవస్త్రాలు, హస్తకళలు,కళాకృతులు స్టాల్స్ ను సందర్శించారు. అనంతరం మర్రి చెట్టు వద్ద గ్రూప్ ఫోటో దిగారు. అనంతరం మొక్కలునాటారు. ఈ కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి,బండ్లకృష్ణ మోహన్‌రెడ్డి,కసిరెడ్డి నారాయణరెడ్డి,మధుసూదన్‌రెడ్డి,వాకిటి శ్రీహరి,పర్ణిక రెడ్డి,వీర్లపల్లి శంకర్,ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

